TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

ఆదివారం, సెప్టెంబర్ 13, 2026 | సంపుటి - 20 | సంచిక 344 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

మెట్రో ప్రయాణికులకు శుభవార్త

600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు

రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం

హైదారాబాద్ : హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మెట్రో రైళ్లల్లో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. ప్రస్తుతం పీక్ సమయాల్లో మెట్రోలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కనీసం నిల్చోవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఈ సమస్యతో మెట్రో ప్రయాణికులు 2లో

భవిష్యత్ టెక్నాలజీ హబ్‌గా అమరావతి

ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయం

జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్

49 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాకులు, పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లు

విజయవాడ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

అమరావతి : వైద్యారోగ్య రంగంలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జనవరి 1వ తేదీ నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేస్తున్నామని, ఇది వైద్య రంగంలో ఒక గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి, తగిన సహకారం అందించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. 2లో

బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

జగన్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసింది

ఆంధ్రప్రదేశ్ మంత్రి సవిత కీలక వ్యాఖ్యలు

'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సు

అమరావతి : బీసీల ఆత్మగౌరవ జీవనమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి సవిత స్పష్టం చేశారు. విజయవాడ సమీపంలోన ఉన్న గొల్లపూడి బీసీ భవన్‌లో నిర్వహించిన 'బీసీ రక్షణ చట్టం' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యపడుతుందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో 'బీసీ రక్షణ చట్టం' తీసుకొస్తున్నామని మంత్రి వెల్లడించారు. బీసీలను కులం లేదా వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా జిల్లాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి, 2 నెలల్లోనే విచారణ పూర్తిచేసేలా పక్కా నిబంధనలు రూపొందించామని స్పష్టం చేశారు. ఈ చట్టం కోర్టులలో బలంగా నిలబడేలా 156 బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధుల సలహాలు తీసుకున్నామన్నారు. తరువాయి 2లో

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష

హైదారాబాద్ :

వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్య మంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన... పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ... "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. 2లో

సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం

చంద్రబాబు సారథ్యంలో ఏపీ సురక్షితం

అమరావతి బయో వ్యాలీకి కేంద్రం అండ

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడి

హైదారాబాద్ : రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జీవనాధారమైన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చూపిస్తున్న చిత్తశుద్ధి, పట్టుదల ప్రశంసనీయమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కొనియాడారు. కేవలం ఆరోగ్య రంగంపైనే కాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే కీలకమైన జలవనరులపైనా ముఖ్యమంత్రికి ఉన్న పట్టు అద్భుతమని ఆయన అన్నారు. శనివారం విజయవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ, హంద్రీ–నీవా వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు చొరవ రాష్ట్ర ప్రగతికి ఎంతగానో దోహద పడుతుందని పేర్కొన్నారు. సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, ఈ దిశగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. తరువాయి 2లో

బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

తెలంగాణ భవన్‌లో 'నమూనా అసెంబ్లీ' నిర్వహణ

కొండా సురేఖ తొలగింపుపై తలసాని తీవ్ర సెటైర్లు

సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగానూ వ్యంగ్యాస్త్రాలు

100 రోజుల హామీల అమలుపైనా చురకలు

రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు

హైదారాబాద్ : తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం 2లో

దసరా నుంచి కొత్త పింఛన్ల పంపిణీ

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు

ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదారాబాద్ : తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. వీరిలో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలా ఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2లో

ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ

న్యూఢిల్లీ : ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. 2లో

కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

ఎప్పటినుంచో ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధమైంది. రద్దీని తగ్గించేందుకు కొత్త రైళ్లను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కొత్త రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. ఒక్కో రైల్లో 2 వేల మంది ప్రయాణించేందుకు వీలుగా 6 కోచ్‌ల రైళ్లను ప్రవేశపెట్టనుంది.తొలి దశలో 60 కోచ్‌లను కొనుగోలు చేయనుండగా.. ఆరు కోచ్‌లతో కూడిన 10 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ఒక్కో రైలుకు రూ.60 కోట్ల వరకు ఖర్చు కానుంది. 60 కోచ్‌ల కొనుగోలుకు రూ.600 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా వేశారు. త్వరలోనే కొత్త రైళ్ల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు. బిడ్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత తుది వ్యయం ఎంత అవుతుందనేది తెలియనుంది. ప్రస్తుతం ఉన్న మెట్రో రైళ్లల్లో మూడు కోచ్‌లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. దీంతో ఒకేసారి వెయ్యి మంది మాత్రమే ప్రయాణించడానికి వీలు కలుగుతుంది. అదే ఆరు కోచ్‌లు అందుబాటులోకి వస్తే ఒకేసారి 2 వేల మంది ప్రయాణించవచ్చు. ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. వీటి వల్ల ఒకేసారి ఎక్కువమంది ప్రయాణికులకు తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చు.ఎక్కువ కోచ్‌లు కలిగిన రైళ్లు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ విపరీతంగా ఉండటం వల్ల కనీసం అడుగు వేసేందుకు కూడా ఖాళీ స్థలం ఉండటం లేదు. దీని వల్ల ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు తర్వాతి రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం మెట్రోలో రోజూ 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే కొత్త మెట్రో రైళ్లు వస్తే 6 లక్షల వరకు పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అమీర్ పేట-రాయదుర్గం మార్గంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రాయదుర్గం స్టేషన్‌లో కొన్నిసార్లు ప్రయాణికులకు కొద్దిసేపు ఆపాల్సి వస్తోంది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కొత్త రైళ్లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చు.

253 కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఫోరెన్సిక్ ల్యాబ్

అమరావతిలోని తుళ్లూరులో నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడి

అమరావతి, సెప్టెంబర్ 12 : రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలు పోలీసు నేర పరిశోధనకు వెన్నుముక లాంటివని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఈరోజు రాజమండ్రిలో పర్యటించిన ఆయన... రాజధాని అమరావతిలోని తుళ్లూరులో రూ.253 కోట్లతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద స్టేట్ లెవల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రాజమండ్రి, తిరుపతి, అనంతపురం, విశాఖ సహా పలు కేంద్రాల్లో ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. డీఎన్ఏ నివేదికలను ప్రస్తుతం 7 రోజుల్లోనే, అత్యంత కీలకమైన కేసుల్లో 13 గంటల్లోనే అందిస్తున్నామని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల నియంత్రణకు జిల్లా స్థాయిలో 'క్లిక్' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాల సందర్భంగా రద్దీ నివారణకు అధునాతన డ్రోన్లు, రికార్డింగ్ మోడ్‌లోని సీసీటీవీల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు

ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఎవరికైనా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు స్పష్టం చేశారు.

బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నాం

గత జగన్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ద్రోహం చేసిందని మంత్రి విమర్శించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా చేతివృత్తుల వారికి ఊతమిచ్చే 'ఆదరణ 3.0' పథకాన్ని కూడా త్వరలోనే అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు.

కన్నతల్లి మరణవార్త తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య..

మెదక్ జిల్లా పెద్దశంకరంపేట విషాద ఘటన

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : అమ్మంటే ప్రేమ.. అమ్మంటే ప్రాణం.. కానీ ఆ కన్నతల్లే లేదనే నిజాన్ని ఆ 19 ఏళ్ల కుమారుడు తట్టుకోలేకపోయాడు. తల్లి లేని లోకంలో తాను ఉండలేనంటూ.. అమ్మ వెళ్లిన దారినే తాను ఎంచుకున్నాడు! మెదక్ జిల్లాలో ఒకే కుటుంబంలో గంటల వ్యవధిలో జరిగిన ఈ జంట ఆత్మహత్యలు స్థానికులను కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్తా లక్ష్మపూర్ గ్రామానికి చెందిన బేతమ్మ (45), ఆమె భర్త బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడే నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, ఇటీవల హైదరాబాద్‌లోని వారి నివాసంలో భార్యాభర్తల మధ్య స్వల్ప గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బేతమ్మ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.హైదరాబాద్‌లో తల్లి బేతమ్మ ఆత్మహత్య చేసుకున్న విషయం సొంత ఊరిలో ఉన్న ఆమె కుమారుడు ప్రవీణ్ (19)కు తెలిసింది. ప్రాణంగా ప్రేమించే కన్నతల్లి ఇకలేదనే విషయాన్ని ఆ యువకుడు తట్టుకోలేకపోయాడు. తీవ్రమైన మానసిక వేదనకు లోనైన ప్రవీణ్, క్షణికావేశంలో తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. వెంటనే కొలపల్లి గ్రామ శివారులోకి వెళ్లి, అక్కడ ఉన్న ఒక చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒకే కుటుంబంలో తల్లి, కొడుకు ఇద్దరూ గంటల వ్యవధిలోనే ఆత్మహత్యలకు పాల్పడటంతో మక్తా లక్ష్మపూర్ మరియు కొలపల్లి గ్రామాల్లో తీవ్ర శోకసంద్రం అలుముకుంది. మరణంలోనూ వీడని ఆ తల్లీకొడుకుల బంధం గురించి తలచుకుని గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి అమోఘం

ఆరోగ్య శాఖ మంత్రిగా పర్యటనకు వచ్చినప్పటికీ, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఆయన ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించడం గమనార్హం.రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన క్వాంటం బయో వ్యాలీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనను జేపీ నడ్డా స్వాగతించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుపై మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన సూచనలు చేసేందుకు త్వరలోనే కేంద్రం నుంచి ఒక సాంకేతిక బృందాన్ని అమరావతికి పంపుతామని వెల్లడించారు. క్వాంటం బయో వ్యాలీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన సూచనలు, ఆయన విజన్ అద్భుతంగా ఉన్నాయని, వాటిని తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంజీవని' కార్యక్రమంపై నడ్డా ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఈ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగని అభివర్ణించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఈ లక్ష్యంతో పనిచేస్తున్న సంజీవని కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సురక్షితమైన చేతుల్లో ఉందని జేపీ నడ్డా అన్నారు. చంద్రబాబు ఒక దార్శనికుడని, నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధిలోనూ చంద్రబాబు పోషిస్తున్న పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన "వంటిల్లే ఫార్మసీ-ఆహారమే ఔషధం" అనే మాటను నడ్డా తన ప్రసంగంలో పలుమార్లు ప్రస్తావించారు. ఆ మాటలు నూటికి నూరు శాతం నిజమని, ఆరోగ్యానికి అదే మూల సూత్రమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే వ్యాధులను దూరం చేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

భవిష్యత్ టెక్నాలజీ హబ్‌గా అమరావతి

శనివారం విజయవాడలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్యారోగ్య శాఖకు చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీని వారు సందర్శించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో జరిగిన సభలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 500 క్రిటికల్ కేర్ బెడ్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు కూడా ప్రజలకు చేరువ కానున్నాయి.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏర్పడిన డబుల్ ఇంజన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అన్నారు. గత 12 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కొనియాడారు. దేశంలో మెడికల్ సీట్లను 51 వేల నుంచి రెట్టింపు చేశారని, కోవిడ్ సమయంలో ప్రపంచానికే వ్యాక్సిన్ అందించి భారత్ సత్తా చాటారని గుర్తుచేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని, జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు తక్కువ ధరకే మందులు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఫార్మా రంగం దేశానికే తలమానికంగా ఉందని, మెడ్‌టెక్ పార్కు ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు.ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సీఎం సూచించారు. "వంటశాలనే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా" భావించాలని పిలుపునిచ్చారు. యోగా, ప్రాణాయామం వంటి సంప్రదాయ పద్ధతులను పాటిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 'హెల్తీ-వెల్తీ-హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు.అమరావతిని భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను అమరావతిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అమరావతి గురించి లద్దాఖ్‌లో కూడా చర్చించుకునే పరిస్థితి వచ్చిందని, భవిష్యత్తులో ప్రపంచమంతా అమరావతి వైపు చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమ, సోము వీర్రాజు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీ, అమరావతి, సంజీవని ప్రాజెక్టుల గురించి ప్రస్తావించినప్పుడు సభికులు, వైద్య విద్యార్థులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిశాక సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నడ్డాతో కలిసి వేదికపై నుంచే సెల్ఫీ తీసుకుని సభికులను ఉత్సాహపరిచారు.

బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ

హైదారాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ పార్టీ విమర్శనాస్త్రాలు సంధించింది. తమ ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించారు. ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ప్రభుత్వ హామీల అమలుపై బీఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్‌గా వ్యవహరించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రను పోషించి రేవంత్ రెడ్డిని అనుకరిస్తూ మాట్లాడారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, "కొండా సురేఖ కుమార్తె నా గురించి మాట్లాడినందుకే ఢిల్లీకి వెళ్లి, మూడు రోజులు ఉండి, ఆమెను (సురేఖను) అణచివేసి వచ్చాను. బీసీ బిడ్డనైన నేను సీఎం అయ్యాక, ఆమెను కేబినెట్ నుంచి తీసేయక ఏం చేయగలను?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన 100 రోజుల హామీలపైనా తలసాని చురకలంటించారు. "100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం కానీ, ఏ 100 రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ ఎద్దేవా చేశారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై చర్చకు పట్టుబట్టినందుకు గాను, సెప్టెంబర్ 9న కేటీఆర్ తో సహా 22 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ సస్పెన్షన్‌కు నిరసనగానే బీఆర్ఎస్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ వేదికపై, ప్రభుత్వం చర్చకు అనుమతించని ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు.

2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్..

త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల

హైదారాబాద్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) బిగ్ అలర్ట్ ఇచ్చింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి 2022లో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తం 544 ఖాళీల భర్తీకి ఇచ్చిన ఈ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు కమిషన్ వెబ్‌నోట్ ద్వారా వెల్లడించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022 డిసెంబర్ 31వ తేదీన కాలేజియేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 544 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. అన్ని పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన తర్వాత 33/2022 బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తాజాగా టీజీపీఎస్సీ ప్రకటించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో ఈ పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. కొత్త నోటిఫికేషన్‌ను ప్రస్తుత నిబంధనలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగా రూపొందించే అవకాశం ఉంది. కమిషన్ వెబ్‌నోట్ ప్రకారం.. 2022 డిసెంబర్ 31వ తేదీన జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను తక్షణమే రద్దు చేశారు. 544 ఖాళీలకు సంబంధించిన ఈ నోటిఫికేషన్ ఇక చెల్లుబాటు కాదని అభ్యర్థులు గుర్తించాలని కమిషన్ సూచించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో గతంలో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగదని అభ్యర్థులు గమనించాలి. కొత్త నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అందులో పేర్కొనే పోస్టుల సంఖ్య, అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, దరఖాస్తు తేదీలు, ఎంపిక విధానం వంటి వివరాలను అభ్యర్థులు తప్పనిసరిగా పరిశీలించాలి. కొత్త నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ తన వెబ్‌నోట్‌లో పేర్కొంది. దీంతో డిగ్రీ కాలేజీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు కొత్త ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

సుద్దాలకు 'తెలంగాణ తెలుగు తేజం' పురస్కారం

సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం

ఈనెల 22న కరీంనగర్‌లో పురస్కారం ప్రదానం

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలుగు సాహిత్య రంగంలో ప్రముఖ కవి, జాతీయ స్థాయి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కింది. బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కారం-2026కు ఆయనను ఎంపిక చేశారు. తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ ఏటా ప్రదానం చేస్తున్న ఈ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈసారి సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. పురస్కార కమిటీ ఛైర్మన్, అవార్డు వ్యవస్థాపకుడు కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్‌రెడ్డి, తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. తెలుగు భాష, సాహిత్యానికి విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో తెలంగాణ తెలుగు తేజం పురస్కారాన్ని ఏటా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కవిగా, సినీ గేయ రచయితగా సుద్దాల అశోక్ తేజ తెలుగు భాషకు విశిష్టమైన సేవలు అందిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ భాష, యాస, సంస్కృతి, సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే సాహిత్య, సినీ రచనలతో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలంగాణ తెలుగు తేజం సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజకు పురస్కారాన్ని అందజేయనున్నారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టిబిడ్డలు అందించిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు పురస్కార కమిటీ ప్రతినిధులు తెలిపారు. భాషా పరిరక్షణ, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న రచయితలు, కవులు, సాహితీవేత్తలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పురస్కారాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సుద్దాల అశోక్ తేజ తెలుగు సాహిత్యంతో పాటు సినీ గేయ రచయితగా కూడా తనదైన ముద్ర వేశారు. సామాజిక అంశాలు, తెలంగాణ జీవన విధానం, ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించే అనేక రచనలకు ఆయన కలం అందించారు. ఆయన సాహిత్య, సినీ ప్రస్థానాన్ని గుర్తిస్తూ తెలంగాణ తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కరీంనగర్‌లో ఈ నెల 22వ తేదీన జరగనున్న పురస్కార ప్రదానోత్సవంతో సుద్దాల అశోక్ తేజకు ఈ గౌరవం అధికారికంగా అందనుంది.

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

దసరా నుంచి కొత్త పించన్ల పంపిణీ

అనంతరం వచ్చే నెల తొలివారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా.. సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది. అలాగే వితంతువులు భర్త డెత్ సర్టిఫికేట్ సమర్పించాలి. అయితే భర్త చనిపోయి ఎక్కువకాలం అయితే సర్టిఫికేట్ పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఇక గీత, చేనేత, ఫైలిరియా, డయాలసిస్ వర్గాలకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి ధృవీకరణ పత్రాలు పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ధ్రువీకరణ పత్రాల అవసరం లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఆ తర్వాత ధృవీకరణ సమయంలో పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే పింఛన్లకు అర్హత సాధిస్తారు. అధికారులో క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర ఆధారాలను పరిశీలించనున్నారు. అనంతరం తుది జాబితా సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం 2.50 లక్షల పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అంతమంది అర్హులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేయనున్నారు. ప్రాధాన్యత వారీగా పూర్తి అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేయనున్నారు. దసరా నుంచి కొత్త ఫించన్లను అందనుడటంతో అర్హులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తుది జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రభుత్వం ఆమోదించాక పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు వర్షాలు

హైదారాబాద్, సెప్టెంబర్ 12(ఆర్ఎన్ఏ): తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ హెచ్చరికలు జారీ చేసింది.ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు వాడటం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడటం, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది.

కార్మిక సమస్యల పరిష్కారంలో గెలిచిన సంఘాలు విఫలం

- టిబిజికెఎస్ ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య

రామగిరి, సెప్టెంబర్ 12(ది క్రైమ్ న్యూస్):- తెలంగాణ బొగ్గ గని కార్మిక సంఘం ఆర్జీ-త్రీ ఏపీఏ ఏరియా ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య శనివారం రోజున ఉదయం 7:00ల షిఫ్ట్ సమయంలో ఎ ఎల్ పి గని కార్మికులను మ్యానువే వద్ద కలవడం జరిగింది. ఈ సందర్భంగా కార్మికుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. కనీసం డ్రిల్ బిట్స్, పనిముట్లు లేని పరిస్థితుల్లో కార్మికులు పనిచేయవలసి వస్తుందని రక్షణ పరికరాలైనా షూస్, గ్లౌస్ సకాలంలో అందించడం లేదని , వెంటిలేషన్ సరిపడా లేదని, పని స్థలాలు మెరుగుపరచడం లేదని ఇంకా పలు సమస్యలు తెలుపుతూ కార్మికులు వాపోయారు. అనంతరం నాగేల్లి సాంబయ్య మాట్లాడుతూ పై సౌకర్యాలు కల్పించడంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని, డిస్మిస్ ల పేరా కార్మికులను వేధించడం సరైనది కాదని, మెడికల్ బోర్డుల కోసం సీనియర్ కార్మికులు ఎదురుచూస్తున్నారని, కార్మికులకు అండగా తెలంగాణ బొగ్గ గని కార్మిక సంఘం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇసంపల్లి రమేష్, కేంద్ర కమిటీ నాయకులు దేవ శ్రీనివాస్, గట్టు శ్రీనివాస్, గని ఫిట్ సెక్రటరీ వి.వి గౌడ్ , పూసల శేఖర్, పేర్క రమేష్, శ్రీనివాసరెడ్డి, దాసరి మల్లేష్, కొప్పుల సురేష్, పిట్టల సది , సందీప్, రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మహేశ్వరం సిఐ

చెరువు పరిసర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన వైనం

మహేశ్వరం సెప్టెంబర్ 12, (ది క్రైమ్ న్యూస్) : గణేష్ విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో కేసీ తండా చెరువు వద్ద చేపడుతున్న ఏర్పాట్లను మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రాఘవేందర్ రెడ్డి శనివారం పరిశీలి ంచారు. సెక్టార్ ఎస్ఐ, విద్యుత్ శాఖ అధికారులు, కేసీ తండా సర్పంచ్‌తో కలిసి నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన ఇన్‌స్పెక్టర్, భక్తులు మరియు ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలను సమీక్షించారు. నిమజ్జన ప్రాంతంలో అవసరమైన ఏర్పాట్లు చేపడుతుండగా, చెరువు పరిసరాల్లో హెచ్చరిక, భద్రతా సూచిక బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. భక్తులు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. కేసీ తండా చెరువులో సుమారు 150 నుంచి 200 గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం సురక్షితంగా, సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లను మహేశ్వరం పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

నా డ్యాన్స్‌తో ఉన్న ఏఐ వీడియో చూసి ఆశ్చర్యపోయా

మోహన్‌లాల్, విజయ్ కంటే నేనే మంచి డ్యాన్సర్

కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ సరదా వ్యాఖ్య

కేఎస్ఈబీ ఉద్యోగులతో కలిసి తాను నృత్యం చేస్తున్నట్లుగా ఉన్న ఒక కృత్రిమ మేధ (ఏఐ) వీడియోను చూసి దిగ్భ్రాంతికి గురయ్యానని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అన్నారు. అయితే, ఆ టెక్నాలజీ పుణ్యమా అని తాను ప్రముఖ నటులు మోహన్‌లాల్, సీఎం విజయ్ కంటే మెరుగ్గా డ్యాన్స్ చేశానని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. శనివారం కేరళ జ్యుడీషియల్ అకాడమీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన సెమినార్‌లో సతీశన్ ప్రసంగించారు. సినిమా, సంగీత రంగాల్లో కాపీరైట్ హక్కుల పరిరక్షణ, డిజిటల్ టెక్నాలజీ సవాళ్లు అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తన అనుభవాన్నే ఉదాహరణగా చూపుతూ, “ఆ వీడియో చూసి నేను షాక్ అయ్యాను. అందులో నేను మోహన్‌లాల్, విజయ్ కంటే బాగా డ్యాన్స్ చేస్తున్నట్లు అనిపించింది” అని సాంకేతిక పరిజ్ఞాన వేగానికి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేరళ తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటూ, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న సమయంలో ఈ ఏఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇటీవల విడుదలైన ‘జైలర్ 2’ చిత్రంలోని ‘అల బొలెలో’ పాటకు సతీశన్, కేఎస్ఈబీ ఉద్యోగులు డ్యాన్స్ చేస్తున్నట్లు ఈ వీడియోను రూపొందించారు. కేవలం వినోదం కోసమే దీనిని రూపొందించామని, ఎవరినీ అవమానించే ఉద్దేశం లేదని క్రియేటర్లు స్పష్టం చేశారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియోను కోటి మందికి పైగా వీక్షించడం విశేషం. ఈ వీడియోపై నెటిజన్లు స్పందిస్తూ విద్యుత్ కోతలపై ప్రభుత్వంపై, కేఎస్ఈబీపై విమర్శలు గుప్పిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి అతీంద్రియ శక్తులేమీ కారణం కాదని, రాత్రిపూట వినియోగం పెరగడమే ప్రధాన కారణమని మంత్రి సన్నీ జోసెఫ్ పేర్కొన్న తరుణంలో సతీశన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

మహిళలకి ఉపాధి కల్పించడమే లక్ష్యం

మహిళా సాధికారత దిశగా ముందడుగు

- స్వర్గీయ శ్రీపాద రావు ఆశీస్సులు, మంత్రి శ్రీధర్ బాబు సౌజన్యంతో

- అలీఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ? ముగ్గింపు

- రాజాపూర్‌లో మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్?

-- సర్పంచ్ పుల్లేల భాగ్యలక్ష్మి కొమురయ్య

రామగిరి, సెప్టెంబర్ 12(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం రాజాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సౌజన్యంతో అలీఫ్ సంస్థ వారి ఆధ్వర్యంలో గత మే నెలలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ విజయవంతంగా ముగిసింది.?శుక్రవారం రాజాపూర్ సర్పంచ్ పుల్లేల భాగ్యలక్ష్మి కొమురయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో.. మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుపతి యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో మహిళలను సంపన్నులను చేయడమే లక్ష్యంగా మహిళలకు ఉపాధిని కల్పించే దిశగా ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని ఇప్పటికే మహిళల సమైక్య గ్రూపులకు ఆర్థికంగా బలపడేందుకు ఎన్నో రకాల పథకాలు ఉన్నాయి.మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి ఎదగాలి.ఈ సర్టిఫికెట్లతో భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. మంత్రి శ్రీధర్ బాబు చొరవతో త్వరలోనే మన ప్రాంతంలో మహిళల కోసం ప్రత్యేక ఇండస్ట్రియల్ కంపెనీలు రాబోతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కాల్వ శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నూరి వెంకటి, వాడు మెంబర్స్ కాల్వ రజిత, పుల్లెల సుజాత, కన్నూరి శశి కుమార్, ఎండి ఆఫీస్, కాదాసి ఓదమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాటేడి రవి, కన్నూరి పర్వతాలు, శ్రీనివాస్, తిరుపతి, రోహిత్, తిరుపతి, మల్లేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించొద్దు

సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు

మధిర ప్రతినిధి ది క్రైమ్ న్యూస్ సెప్టెంబర్ 12: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించకుండా భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మధిర నియోజకవర్గం బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లోని పోరాట యోధుల స్థూపాల వద్ద సీపీఐ నాయకులు నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు తమ్మారపు గోవిందు, తమ్మారపు భద్రయ్య స్థూపాలకు సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనాటి పోరాటంలో ఒకే చితిపై ప్రాణాలు కోల్పోయిన ఏడుగురు అమరుల స్థూపానికి బాగం హేమంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు. వేలాది మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగాలు చేసి, ప్రజలను సమీకరించి సాగించిన పోరాటం ఫలితంగానే తెలంగాణ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి మార్గం సుగమమైందన్నారు. ఈ చారిత్రక పోరాటాన్ని హిందూ--ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం సరికాదని అన్నారు. ఆనాటి పోరాటంలో కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక హక్కులు, భూమి కోసం పోరాడారని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి అధికారికంగా నిర్వహించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. పాలకులు మారుతున్నప్పటికీ సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఆనాటి పోరాట యోధుల కుటుంబాలకు సముచిత గుర్తింపు కల్పించాలని కోరారు. గోవిందాపురం(ఎల్) తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన చారిత్రక గ్రామమని హేమంతరావు పేర్కొన్నారు. మల్లెల వెంకటేశ్వరరావు నాయకత్వంలో తమ్మారపు గోవిందు, తమ్మారపు భద్రయ్యతో పాటు అనేక మంది ఈ ప్రాంతంలో పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. సాయుధ పోరాటంలో గ్రామ ప్రజల భాగస్వామ్యాన్ని అణచివేయాలనే ఉద్దేశంతో ఏడుగురిని ఒకే చితిపై దహనం చేసిన ఘటన ఈ ప్రాంత పోరాట చరిత్రలో విషాదకర ఘట్టమన్నారు. అమరుల స్ఫూర్తితో భవిష్యత్ ప్రజా ఉద్యమాలను నిర్మించి కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కుల రామారావు, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, సీపీఎం గ్రామ కార్యదర్శి తమ్మారపు లక్ష్మణ్, గోవిందాపురం(ఎల్) సర్పంచ్ మంద కరుణ, ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య, పుచ్చకాయల తిరవతయ్య, తమ్మారపు మల్లయ్య, తమ్మారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల్లో రూ.30 లక్షల అవకతవకలు

సంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి ఘరానా మోసం

అవకతవకలఆపి సంఘ సభ్యుల ఆగ్రహం

హైదారాబాద్ : సంగారెడ్డి జిల్లా కంది మండలం పాతకంది గ్రామ సంఘంలో మహిళా సంఘాలకు మంజూరైన స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు తేలింది. వివిధ మహిళా సంఘాల పేర్లపై మంజూరైన రుణాల్లో సుమారు రూ.30 లక్షల మేర నిధులను మాజీ వీవోఏ వినియోగించినట్లు విచారణ నివేదికలో వెల్లడైనట్లు సమాచారం. రుణాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న మహిళలకు ఈ వ్యవహారం తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. దీంతో సదురు మహిళా సభ్యులు మంగళవారం కందిలో నిర్వహించిన డ్వాక్రా మహిళా సంఘాల సమావేశంలో అధికారులను నిలదీశారు.వీవోఏ మార్పు.. వెబ్‌సైట్‌లో నమోదు కాలేదంటూ నివేదిక గత ఏడాది జనవరిలో గ్రామ సంఘం వీవోఏను తొలగించి కుమ్మరి పుష్పలతను కొత్త వీవోఏగా ఎన్నుకున్నట్లు విచారణ నివేదికలో పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు ఆమె పేరు సెర్ప్ ఐబీ వెబ్‌సైట్‌లో నమోదు కాలేదని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అయినప్పటికీ రూ.50 వేల గౌరవ వేతనం డ్రా చేసి ఆమెకు చెల్లించినట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. గ్రామ సంఘ సమావేశాలకు మండల సమాఖ్య నుంచి కమ్యూనిటీ కోఆర్డినేటర్ క్రమం తప్పకుండా హాజరు కాకపోవడం, ఏపీఎం స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ అవకతవకలకు అవకాశం ఏర్పడినట్లు విచారణ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. విచారణలో సుమారు రూ.30 లక్షల మేర అవకతవకలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు గుర్తించినప్పటికీ.. ఇప్పటి వరకు మాజీ వీవోఏపై కఠిన చర్యలు తీసుకోలేదని మహిళా సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సంబంధిత మహిళా సంఘాలకు కొత్త రుణాల మంజూరు కూడా నిలిచిపోయింది.తమకు రావాల్సిన రుణాలను వెంటనే మంజూరు చేయడంతో పాటు, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణాలపై ఆధారపడుతున్న తమకు ఈ పరిణామం తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వారు పేర్కొంటున్నారు. బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

‘ఢీ-10’ డ్యాన్స్ షో విన్నర్ రాజు అరెస్ట్

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన ‘ఢీ-10’ డ్యాన్స్ షో విజేత రాజును హైదరాబాద్ మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్ విధించింది.

జాతీయ లోక్ అదాలత్‌లో 1.03 లక్షల కేసులకు పరిష్కారం

మేడ్చల్, సెప్టెంబర్ 11(ది క్రైమ్ న్యూస్): మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వి. బాల భాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక మాట్లాడుతూ రాజీ ద్వారా పరిష్కరించదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా సత్వరంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్ కేసులతో పాటు బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన ప్రీ--లిటిగేషన్ కేసులను కూడా లోక్ అదాలత్‌లో పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఏర్పాటు చేసిన 24 బెంచ్‌ల ద్వారా మొత్తం 1,03,857 కేసులకు పరిష్కారం చూపినట్లు వెల్లడించారు. ఇందులో 46 సివిల్ కేసులు, 1,03,800 వివిధ రకాల క్రిమినల్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. అలాగే బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన 11 ప్రీ--లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించినట్లు పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించిన కేసులకు సంబంధించి మొత్తం రూ.54.75 లక్షలను పరిహారం కింద చెల్లించినట్లు జి.ఎస్.ఎల్. ప్రియాంక తెలిపారు. రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాల అంగీకారంతో కేసులకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు తమకు సంబంధించిన రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి. తిరుపతి, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, గవర్నమెంట్ ప్లీడర్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, పోలీసు అధికారులు, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ధరణి పోర్టల్ తో వేలాది ఎకరాలు చెర

నిషేధిత భూముల జాబితా కొత్తది కాదు

అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి

హైదారాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు భూముల వ్యవహారం హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. 22ఏకారణంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, భూముల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. తాజాగా అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గణాంకాలతో బీఆర్ఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 22ఏ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, భూముల విలువలు భారీగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడుతోందని విమర్శించారు. ఈ ఆరోపణలకు అసెంబ్లీ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాధానమిచ్చారు. 22ఏ కారణంగా రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రాబడి తగ్గిపోయాయన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను వెల్లడించారు. మంత్రి అసెంబ్లీకి తెలిపిన వివరాల ప్రకారం.. 2025 ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు ఐదు నెలల కాలంలో రాష్ట్రంలో మొత్తం 4,90,478 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయన్నారు. అదే ఐదు నెలల కాలాన్ని 2026లో పరిశీలిస్తే 5,10,273 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 19,795 డాక్యుమెంట్లు అదనంగా రిజిస్టర్ అయ్యాయని మంత్రి వివరించారు. ఇక రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని పరిశీలించినా తగ్గుదల కనిపించలేదని మంత్రి పొంగులేటి తెలిపారు. 2025లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లో రూ.6,216 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అదే 2026లో ఐదు నెలల కాలంలో రూ.7,575 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. అంటే గత ఏడాదితో పోలిస్తే రూ.1,359 కోట్ల అదనపు ఆదాయం వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ 22ఏ వల్ల రిజిస్ట్రేషన్లు, ఆదాయం తగ్గిపోయాయన్న బీఆర్ఎస్ ఆరోపణలను మంత్రి పొంగులేటి తిప్పికొట్టారు. వాస్తవ పరిస్థితిని గణాంకాలే చెబుతున్నాయని స్పష్టం చేశారు. మరోవైపు 22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో మాత్రం రాజకీయ వాదోపవాదాలు కొనసాగాయి. భూముల రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రియల్ ఎస్టేట్ రంగం, సామాన్యుల భూ హక్కులు వంటి అంశాలు ఈ వివాదంతో ముడిపడి ఉన్నాయి. దీంతో 22ఏ అంశం కేవలం రెవెన్యూ వ్యవహారంగా కాకుండా తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన రాజకీయ అంశంగా మారింది. మరోవైపు తెలంగాణ శాసనసభ సాక్షిగా రాష్ట్రంలో నెలకున్న భూ సమస్యలు, 22ఏ నిబంధనలు , ధరణి అక్రమాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకుని గత పాలకులు లక్షలాది ఎకరాలను చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వారి బండారం బయటపడుతుండటంతోనే సభ నుంచి తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారని అన్నారు. అలాగే ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలోని దాదాపు 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి సమయాల్లో రిజిస్ట్రేషన్లు చేశారని కీలక ఆరోపణలు చేశారు. ప్రజల ఆస్తులను పరిరక్షించడమే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శాసనసభలో 22ఏ నిషేధిత భూముల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ఆశామాషీగా తీసుకురాలేదని.. దాదాపు 18 రాష్ట్రాల్లోని అధికారులు అధ్యయనం చేశాక..ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే భూ భారతికి రూపకల్పన చేశామని స్పష్టం చేశారు.

సంపాదకీయం

తీరప్రాంత నగరాలకు తీరని ముప్పు

భూతాపం పెరుగుతున్న కొద్దీ హిమనదాలు, మంచుపలకలు కరగడం, సముద్ర మట్టాలు పెరుగుతుండడం జరుగుతోంది. దీంతో తీరప్రాంతంలో తక్కువ ఎత్తులో ఉన్న నగరాలు, నదీ డెల్టాలకు ప్రమాదం పొంచి ఉంటోంది. భారత్‌లో ఆ జాబితాలో ముంబై, కోల్‌కతా నగరాలు చోటుచేసుకున్నాయి. సముద్రమట్టం వేగంగా పెరుగుతున్నందున భారత దేశంలోని తీరప్రాంత నగరాలకు, భవిష్యత్తులో వరదలు, మౌలిక సదుపాయాలకు తీరని నష్టం, ప్రజల జీవనోపాధి సమస్యలు వంటి ప్రమాదాలను ఎదుర్కొనే అవకాశం కనిపిస్తోంది. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే ప్రపంచంలో ప్రస్తుతం దాదాపు 770 మిలియన్ల మంది ప్రజలు అధిక ఆటుపోట్ల రేఖకు 5 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న తీరప్రాంతాల్లో నివసిస్తున్నారు. అంటే ప్రపంచ జనాభాలో ప్రతి పదిమందిలో ఒకరు సముద్ర మట్టం పెరుగుదలకు అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో జీవిస్తున్నారు. 2050 నాటికి 120 కోట్ల మంది ప్రజలు తమ నివాస ప్రాంతాల నుంచి తరలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చని ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తోంది. పసిఫిక్ ద్వీపాల్లోని కొన్ని సముదాయాలు ఇప్పటికే తమ భూభాగం క్రమంగా కోల్పోతుండడంతో పునరావాస ప్రక్రియలను ప్రారంభించాయి. ఆర్థికంగా నష్టాన్ని పరిశీలిస్తే తీర ప్రాంత మౌలిక సదుపాయాలకు ఇప్పటికే 1.8 ట్రిలియన్ డాలర్లకుపైగా నష్టం జరుగుతోంది. అనుసరణ చర్యలు తగినంతగా లేకుంటే ఈ శతాబ్దం చివరినాటికి ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 1.2 ట్రిలియన్ నుంచి 4 ట్రిలియన్ డాలర్ల వరకు నష్టం సంభవించే అవకాశం ఉంది. ఇటు ప్రపంచంలోని ఇతర తీరప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలు కూడా రాబోయే ప్రమాదానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. జర్మనీ తీర రేఖలో దాదాపు 70 శాతం సముద్రపు కోతను ఎదుర్కొంటోంది. ఫ్రెంచి రివియెరా లోని చిన్న ఇసుక తీరాలు, 19వ శతాబ్దం చివరి నుంచి దాదాపు 50 శాతం తమ విస్తీర్ణాన్ని కోల్పోయాయి. కరీబియన్ ప్రాంతంలో 2050 నాటికి దాదాపు 40% బీచ్‌లు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. చేరువవుతున్న చేనేత కులాలు ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఐక్యరాజ్యసమితి 18 చర్యలను సూచించింది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను వేగంగా తగ్గించడం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయడం, వాతావరణ అనుసరణకు నిధులు పెంచడం, శాస్త్రీయ సమాచారాన్ని మెరుగుపర్చడం, ప్రమాదంలో ఉన్న ప్రజలకు రక్షణ కల్పించడం తదితర చర్యలు ఇందులో ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి ఇటీవల విడుదల చేసిన నివేదికలో 20142023 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టం సంవత్సరానికి సగటున 4.7 మి.మీ వంతున పెరిగింది. 2024లో అయితే ఇది రికార్డు స్థాయిలో 5.9 మి.మీ పెరిగింది. కనీసం 50 సెం.మీ సముద్ర మట్టం పెరుగుదల ఇప్పటికే తప్పనిసరిగా సంభవించే పరిస్థితిలో ఉంది. దీని ప్రభావం భవనాలు, రోడ్లు, నౌకాశ్రయాలు వంటి భౌతిక మౌలిక సదుపాయాల నష్టంతో మాత్రమే పరిమితం కాదు. ప్రజల జీవనోపాధి, ఆర్థిక వ్యవస్థ, తీరప్రాంతాల ప్రజల భద్రత వంటి అనేక అంశాలపై తీవ్రమైన ప్రభావం పడవచ్చు. అందువల్ల దాని ప్రభావాలను ఎదుర్కొనేందుకు మనం ముందుగానే చర్యలు తీసుకోవడం తప్పనిసరి. ముంబై, కోల్‌కతా, ఢాకా నగరాల్లో 1.4 కోట్లకుపైగా ప్రజలు శాశ్వతంగా నీటిలో మునిగిపోయే ప్రమాదం ఉందని, వారు తమ ప్రాణాలను, ఇళ్లను, జీవనోపాధిని కోల్పోతారని ఐక్యరాజ్యసమితి అంచనా వేస్తోంది. దక్షిణాసియాలో ప్రమాదానికి గురికానున్న నగరాలకు, మయామి, న్యూయార్క్ వంటి సంపన్న తీర నగరాలకు మధ్య ముఖ్యమైన తేడా ఉంది. మయామి, న్యూయార్క్ వంటి సంపన్న నగరాల్లో భవనాలు, రవాణా వ్యవస్థలు, ఆస్తులు ధ్వంసం కావడం లేదా వాటి విలువ తగ్గిపోవడం జరుగుతుంది. సంక్లిష్టతల్లో బ్రిక్స్ శక్తి ఎంతవరకు? అయితే ముంబై, కోల్‌కతా వంటి నగరాల్లో ప్రజలు తమ ఇళ్లు, ఉద్యోగాలు, జీవనోపాధిని కోల్పోయి వేరే ప్రాంతాలకు తరలిపోయే పరిస్థితి ఏర్పడవచ్చు. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాలకు వాతావరణ మార్పుల వల్ల కలిగే ప్రభావాలను ఎదుర్కోడానికి ప్రతి సంవత్సరం 310 బిలియన్ డాలర్ల నుంచి 365 బిలియన్ డాలర్ల వరకు నిధులు అవసరం. భారతదేశం తన సొంత పెట్టుబడులతోపాటు బహు పాక్షిక సంస్థల నుంచి వచ్చే నిధులు, రాయితీతోకూడిన రుణాలును కూడా ఉపయోగించుకోక తప్పదు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులను గతంలో వచ్చిన వరదల ఆధారంగా మాత్రమే కాకుండా, భవిష్యత్తులో సముద్ర మట్టం ఎంత పెరుగుతుంది? భూమి ఎంతమేరకు కుంగిపోతుంది? అనే కోణంలో దీర్ఘకాలిక అంచనాలను పరిగణనలోకి తీసుకోవాలి. వరదలు, సముద్ర మట్టం పెరగడం వంటి విపత్తులు వచ్చిన తరువాత భారీగా డబ్బుఖర్చు చేయడం కన్నా అవి రాకముందే రక్షణ చర్యలు చేపట్టడం అవసరం. మాస్టర్ ప్లానుల్లో కొత్త నిర్మాణాలకు అనుకూలం కాని ప్రాంతాలను స్పష్టంగా గుర్తించాలి. అలాగే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రత్యామ్నాయ మార్గాలను, అత్యవసర పరిస్థితుల్లో కీలకమైన మౌలిక సదుపాయాలను రక్షించాలి. వాతావరణ మార్పులకు తట్టుకునే సామర్థం ఉన్న గృహాల కోసం భూమిని ముందుగానే కేటాయించాలి. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలను ప్రమాదకర ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించే ప్రణాళికలను సిద్ధం చేయాలి. ముందస్తు హెచ్చరికల వ్యవస్థలను, స్థానికంగా సముద్ర మట్టం పెరుగుదలను పర్యవేక్షించే వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి. ముందుగానే సరైన ప్రణాళికలు రూపొందించడం, ప్రమాదకర ప్రాంతాల్లో నిర్మాణాలను నియంత్రించడం, ప్రజలకు సురక్షితమైన గృహాలను నిర్మించడం, ఇవన్నీ చేస్తే భవిష్యత్తులో జరిగే నష్టాన్ని చాలావరకు తగ్గించవచ్చు.

అమెరికాకు తల ఒగ్గితే భవిత అయోమయం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2025 జులై 8వ తేదీ నాటికి అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారతదేశానికి గడువు విధించిన నేపథ్యంలో వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని భారత బృందం, జేమీసన్ గ్రియర్ నేతృత్వంలోని అమెరికా బృందంతో వాషింగ్టన్‌లో 2 రోజుల చర్చలు జరిపింది. గోయల్ రెండు రోజుల క్రితం తిరిగి భారత దేశానికి వచ్చినప్పటికీ, వాణిజ్య కార్యదర్శి ఇంకా అమెరికాలో ఉన్నసమయంలో ట్రంప్ ఏకపక్షంగా భారతదేశంతో ఒక పెద్ద వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించాడు. ఇందులో భారతదేశాన్ని మరింత తెరవాలని స్పష్టమైన సందేశం ఉంది. అయితే వివరాలు ఇంకా వెల్లడించలేదు. ఇది ట్రంప్ 2025 మే 10న ప్రకటించిన అమెరికా – మధ్యవర్తిగా ఇండో –పాక్ కాల్పుల విరమణ, దానితో అనుసంధానించిన అమెరికా– భారత వాణిజ్య ఒప్పంద ప్రకటన కొనసాగింపే. ఇది మరోసారి ఆర్ఎస్ఎస్ ప్రేరేపించిన మోడీ పాలన అమెరికా సామ్రాజ్యవాదానికి చేసిన దౌర్భాగ్యకర నయా వలసవాదానికి తలవంచే విధానాన్ని బయటపెడుతోంది. 2025 ఏప్రిల్ 2న ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా రక్షణాత్మక షరతులు, పరిమితులు విధిస్తూ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశంలో భాగంగా ఉక్కు, అల్యూమినియంలపై 26% పన్నులు విధించడమే కాకుండా, భారత్‌లో తమ మార్కెట్‌కు (%ఘ్రతీఎవ్ ×అఎఖు%) అడ్డంకులు లేని ప్రవేశం కోసం డిమాండ్ చేశారు. ప్రపంచంలోని తూర్పున చైనా నుండి పశ్చిమ యూరప్, కెనడా వరకు పలు దేశాలు వెంటనే ప్రతిచర్యలు ప్రకటించాయి. లాటిన్ అమెరికా దేశాలు, ఆఫ్రికా దేశాలు కూడా ఈ ఏకపక్ష ట్రంప్ పన్నుల విధింపునకు వ్యతిరేకంగా గళమెత్తాయి. చైనా కౌంటర్ (ప్రత్యర్థిగా పన్నులుగా విధానానికి) టారిఫ్‌లకు ప్రతిచర్యగా ట్రంప్ చైనాతో రెండు దఫాల చర్చలతర్వాత వాణిజ్య ఒప్పందానికి వెళ్లాల్సి వచ్చింది. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి మాటలు పలికే మోడీ మాత్రం ట్రంప్ ఏకపక్షంగా బెదిరించే పద్ధతిలో పన్నులను విధించటం గురించి ఏమీ మాట్లాడకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ఇప్పుడు ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో భారతదేశంలో తక్కువ వేతనంతో పని చేసే రంగాలైన టెక్స్‌టైల్, రత్నాభరణాలు, చర్మవస్తువులు, వస్త్రాలు, ప్లాస్టిక్, రసాయనాలు, రొయ్యలు, నూనెగింజలు, ద్రాక్ష, అరటిపండ్లపై అదనపు 26% పన్నుల నుండి పూర్తి మినహాయింపు కోసం వేడుకుంటుంటే, అమెరికా మాత్రం అధునాతన సాఫ్ట్‌వేర్‌లు, పరిశ్రమల వస్తువులు, ఆటో లు, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పెట్రో రసాయన ఉత్పత్తులు, వైన్, పాల ఉత్పత్తులు, ఆపిల్స్, ఇంతటితోనే కాకుండా జన్యుపరిణామం చేసిన పంటలపై డ్యూటీ మినహాయింపులు కోరుతోంది. ఈ ఒప్పందం ద్వారా 2025లో 191 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచాలన్నది లక్ష్యం. ఈ కొత్త ఒప్పందాన్ని 2025 జులై 8న ప్రకటించే అవకాశం ఉంది. స్వతంత్ర పరిశీలకుల ప్రకారం ట్రంప్ భారతదేశాన్ని మరింతగా తెరవాలి 'ఓపెన్ అప్ ఇండియా' అనేది 'స్టార్టప్ ఇండియా' చొరవను సూచిస్తుంది. ఇది స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు మద్దతు ఇచ్చే పర్యావరణ వ్యవస్థను పెంపొందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ప్రధాన కార్యక్రమం. వ్యవస్థాపకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని ఉద్యోగ సృష్టికర్తల దేశంగా మార్చడం దీని లక్ష్యం. ఈ చొరవ పన్ను మినహాయింపులు, నిధులకు సులభమైన ప్రాప్యత, మేధో సంపత్తి రక్షణకు మద్దతు వంటి వివిధ ప్రయోజనాలను అందిస్తుంది. కొత్తప్రకటన ఆధారంగా మోడీ పాలన అమెరికా ఉత్పత్తుల కోసం ఎర్రతివాచి పరచడానికి సిద్ధమవుతోంది. 2020 నివేదిక ప్రకారం ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇండెక్స్‌లో భారతదేశం 190 దేశాలలో 63వ స్థానంలో ఉంది. 2014లో 142వ స్థానం నుండి ఇది గణనీయమైన మెరుగుదల. 2021లో ప్రపంచ బ్యాంకు ఈ నివేదికను నిలిపివేసింది. కానీ అప్పటి వరకు భారతదేశం సాధించిన పురోగతి నియంత్రణ సంస్కరణలకు, మరింత వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో దాని నిబద్ధతను హైలైట్ చేసింది. ఫలితంగా భారత ఔషధ పరిశ్రమపై తీవ్ర ప్రభావంపడడం, డిజిటలైజేషన్, కృత్రిమ మేధ (ఎఐ)వంటి సాంకేతిక విధానాలలో భారత్ కష్టపడి సాధించిన పురోగతిని దెబ్బతీసే పరిస్థితులు ఏర్పడుతాయి. సోయాబీన్, మొక్కజొన్న, ఆపిల్స్, పాలు మొదలైన వాటిపై అమెరికా ఒత్తిడి వల్ల వచ్చే కొత్త పన్ను మినహాయింపుల మొదటగా నష్టపోయేది,బలిపశువులు అయ్యేది రైతాంగమే. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై తక్కువ పన్నులు, జిపి –(జెనిటికల్లి మాడిఫైడ్ – జన్యుపరంగా మార్పిడి చేయబడింది– ఉదాహరణకు బిటి విత్తనాలు%–%) విత్తనాల స్వేచ్ఛా ప్రవేశం, అమెరికా అగ్రిబిజినెస్, బహుళజాతి కంపెనీల (ఎంఎన్‌సిల) స్వేచ్ఛా విస్తరణ భారత వ్యవసాయానికి ఘోర విపత్తుకావడం ఖాయం. ఇది 2020 సెప్టెంబర్‌లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఆదేశాల ప్రకారం కొవిడ్ సమయంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన మూడు రైతు చట్టాలను గుర్తుకు తెస్తోంది. అదే విధంగా రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు అమెరికా –భారత పౌర అణు ఒప్పందాన్ని (సివిల్ న్యూక్లియర్ ఒప్పందాన్ని)కూడా ఈ వాణిజ్య ఒప్పందానికి అనుబంధంగా కలిపారు. దీనిలో భాగంగా అణుశక్తి చట్టాన్ని(అటామిక్ ఎనర్జీ చట్టం) సవరించడం, ప్రైవేట్ పెట్టుబడులకు అనుమతులు ఇవ్వడం, న్యూక్లియర్ ప్రమాదం జరిగితే కంపెనీల బాధ్యతను తగ్గించేలా సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ (అణు నష్టానికి పౌర బాధ్యత చట్టాన్ని–) చట్టాన్ని సవరించడం మోడీ ప్రభుత్వం ప్రతిజ్ఞాబద్ధమైంది. 2025 బడ్జెట్‌లో విదేశీ న్యూక్లియర్ సంస్థలకు చిన్న మాడ్యులర్ రియాక్టర్లు నిర్మించడానికి మార్గం ఇచ్చినది.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

మహబూబాబాద్: వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కి తృటిలో ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఈ ట్రైన్ మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో అప్ లైన్‌లో 428/11 వద్ద రైల్వే ట్రాక్‌పై వచ్చిన ఎద్దును బలంగా ఢీకొట్టింది. దీంతో కొన్ని నిమిషాల పాటు రైలు ట్రాక్‌పై నిలిచిపోయింది. వందేభారత్ సిబ్బంది రైల్వేస్టేషన్ అధికారులకు సమాచారం అందించగా.. వాళ్లు ఘటనస్థలికి చేరుకొని ట్రాక్‌పై నుంచి ఎద్దును తొలగించారు. ఈ ఘటనలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ముందు భాగం విరిగిపోయింది. ఆ తర్వాత రైలు యధావిధిగా సికింద్రాబాద్‌కు బయలుదేరింది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రాక్‌పై నిలిచిపోవడంతో ఆదే ట్రాక్‌పై వచ్చే ఇతర రైళ్లను కొంత సమయం నిలిపివేశారు. ఈ సమయంలో వందేభారత్‌లోని ప్రయాణికులు కాస్త ఇబ్బందిపడ్డారు. మరోవైపు ఎద్దు యజమాని కోసం సమీప రైల్వేస్టేషన్ అధికారులు గాలిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

సిరిసిల్ల నేతన్నలపై అణచివేత ఆపాలి

ఉరిసిల్లగా మారిన సిరిసిల్లను ఆదుకునేందుకు, ఆకలి చావు లు, ఆత్మహత్యలు, వలసలను నివారించడానికి ఇదివరకటి కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు, ఆర్‌వీఎం వంటి పథకాలు తెచ్చింది. అవి కార్మికుల ఉపాధికి ఆధారమయ్యాయి. స్కూల్ విద్యార్థి, విద్యార్థినుల యూనిఫామ్‌లు, బతుకమ్మ పండుగకు బతుకమ్మ చీరల ఉత్పత్తి సిరిసిల్ల కార్మికుల ఉపాధికి భరోసానిచ్చాయి. బతుకమ్మ చీరల్లో అవినీతి జరిగిందని, నాణ్యత లేదని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని రద్దు చేసింది. బతుకమ్మ చీరల్లో నాణ్యత లేకపోతే అంతకంటే మంచి చీరలను తయారు చేయించాలి. అవినీతి జరిగితే అవినీతి చేసిన అధికారులపై, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి తప్ప ఉన్న పథకాలను తీసివేసి ఉపాధి లేకుండా చేసి కార్మికులను రోడ్డున పడేయడం ప్రజాపాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సబబేనా? సంవత్సరన్నర కాలంలో 38 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. వందలాది మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులు మరోసారి పోరుబాట పట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో బతుకమ్మ చీరల స్థానంలో తెలంగాణ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న 65 లక్షల మంది మహిళలకు రెండు చీరల చొప్పున 1 కోటి 30 లక్షల చీరలను ఉత్పత్తి చేయిస్తామని, తద్వారా కార్మికులకు ఉపాధి, మెరుగైన ఆదాయం కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. చీరల ఉత్పత్తికి ఆర్డర్ తెచ్చుకున్న సంఘాలకు, యాజమాన్యాలకు ఒక మీటర్‌కు రూ.9 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ధర నిర్ణయించింది. కష్టపడి చీరలను నేసే కార్మికుడికి కూలి మాత్రం ప్రభుత్వం నిర్ణయించలేదు. ఇదెక్కడి న్యాయం? చీరల ఉత్పత్తికి కూలి ప్రభుత్వం నిర్ణయించాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరితే మీరు యజమానులను అడగండి మాకు సంబంధం లేదని చేతులు దులుపుకోవడం సరైనదేనా? ఈ నేపథ్యంలో సిరిసిల్ల నేత కార్మికులు ఏప్రిల్ 1 నుండి సమ్మెకు దిగారు. ఈ సమ్మెను విచ్ఛిన్నం చేయడం కోసం సమ్మె చేస్తున్న కార్మికులను, వారికి అండగా నిలబడిన కార్మిక సంఘాల నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారు. కేసులు పెడతామని భయపెడుతున్నారు. కార్మికులను, నాయకులను పోలీసులు భయాందోళనలకు గురిచేయడం ప్రజాస్వామ్యబద్ధమేనా? తమకు ప్రభుత్వం కూలి నిర్ణయించాలని, పాలిస్టర్ వస్త్రానికి కార్మికుల ఒప్పందం ప్రకారం కూలి చెల్లించాలని, 2023లో కార్మికులకు చెల్లించాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని, 10 శాతం యారన్ సబ్సిడీని వర్తింపజేయాలని ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మె చేస్తున్న కార్మికులను నిర్బంధించి సమ్మెను విచ్ఛిన్నం చేయాలనుకోవడం ప్రజాపాలన అనిపించుకుంటుందా? ప్రభుత్వానికి కార్మికుల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే నిర్బంధం, అరెస్టులకు పాల్పడకుండా కార్మికులు అడుగుతున్న న్యాయమైన కోర్కెలను తీర్చాలి. సమస్యలను పరిష్కరించకుండా నిర్బంధించి పరిపాలన చేస్తామంటే కార్మికులు చూస్తూ

నైతికబలమే ఆత్మశక్తి

ప్రభువు చుట్టూ ప్రజలు తండోపతండాలుగా ఉండేవారు. ఆయన సన్నిధిలో ఆకలి నిద్రలు మరచి పులకించిపోయేవారు. ప్రభువు పలుకులే వారికి దివ్యౌషధాలు. అలాంటి వారిని అప్పుడప్పుడూ కొందరు అహంకారులు పట్టి పీడించేవారు. వారిపై దౌర్జన్యానికి పాల్పడేవారు. అయినా వారంతా మొక్కవోని ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ప్రభువు దగ్గరే అచంచలమైన దీపాల్లా వెలుగుతుండేవారు. వారిని చూసి జాలిపడిన ప్రభువు.. 'ఆత్మవిషయమై దీనులైన మీరు ధన్యులుబీ పరలోకరాజ్యము మీదే' అని ఊరట కలిగించేవారు. ప్రభువు కొండమీద కూర్చొని అలా పలుకుతుంటే, చిన్నగా జాలువారే అమృతధారలు వారిలో జీవం ఉప్పొంగించేవి. అలా ఆయన మాటలు దుఃఖపడే వారిని ఓదార్చేవి. నీతి కోసం నిలబడే నైతిక బలమే ఆత్మశక్తిని, తృప్తినీ ఇస్తాయని ప్రభువు వారికి బోధిస్తుండేవారు. ప్రభువు బోధనలు ఆధ్యాత్మిక, భౌతిక, తాత్వికతకు మూలబీజాలుగా ఉండేవి. ఎందరెందరో బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేసేవి. బాధితుల మనసుకు సాంత్వన చేకూర్చేవి.

ఆధ్యాత్మికం

వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ప్రభుత్వ నిబంధనలకు లోబడి జరుపుకోవాలి: పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి

● గోదావరిఖని కోదండ రామాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం

గోదావరిఖని క్రైమ్ : వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ప్రభుత్వ నిబంధనలకు లోబడి జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కోదండ రామాలయంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి పెద్దపల్లి డీసీపీ బి రామ్ రెడ్డి, గోదావరిఖని సబ్ డివిజన్ ఇన్చార్జి ఏసీపీ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని, డీజే సౌండ్ వల్ల ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా గుండెపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం ఉన్నందున సుప్రీంకోర్టు డీజే వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, కాబట్టి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఎవరూ డీజేలను వినియోగించకూడదని తెలిపారు. గోదావరిఖని ప్రజలు ఎప్పుడూ పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తున్నారని, ఏ సంఘటన జరిగినా పోలీసులకు అండగా నిలుస్తూ, పోలీసులు సూచించిన నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ సహకరిస్తున్నారని, వివిధ జిల్లాలు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చి గోదావరిఖనిలో నివసిస్తున్న ప్రజలు ఇక్కడి ఆచారాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ అందరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జీవిస్తున్నారని, అందుకే గోదావరిఖని ఒక మినీ మాంచెస్టర్గా ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో వినాయక నిమజ్జనం కూడా అందరూ కలిసి ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించాలని, నిమజ్జన శోభాయాత్రను వీలైనంత త్వరగా ప్రారంభించాలని, మధ్యాహ్నం సమయంలో శోభాయాత్ర ప్రారంభిస్తే, సాయంత్రం 5 లేదా 6 గంటలకు ప్రధాన చౌరస్తాకు చేరుకునేలా ప్రణాళిక చేసుకోవాలని, ప్రధాన చౌరస్తాకు చేరుకున్న అనంతరం అక్కడి నుంచి గోదావరి బ్రిడ్జి వద్ద నిమజ్జనం కోసం శోభాయాత్ర ప్రశాంతంగా కొనసాగాలని వెల్లడించారు. ఈ మొత్తం కార్యక్రమంలో పోలీస్ శాఖకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సహకరించాలని, ముఖ్యంగా ఎవరూ డీజే ఏర్పాటు చేసుకోవద్దని, ఇది కేవలం పోలీసుల ఆదేశం కాదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమలు చేయడంలో భాగమని, ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని బాధ్యతగా తీసుకుని పోలీస్ శాఖకు సహకరించాలని స్పష్టం చేశారు. భగవంతుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం ద్వారా మనకు, మన కుటుంబాలకు మంచి జరగాలని కోరుకుంటామని, అలాంటి పవిత్రమైన కార్యక్రమంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి మనకు మనమే ఇబ్బందులు, నష్టాలు తెచ్చుకోకూడదని, అందరూ సంతోషంగా, ప్రశాంతంగా ఉత్సవాలను నిర్వహించుకోవాలి, మీ కుటుంబాలకు, మీ పిల్లలకు, ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని, వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. వినాయక నిమజ్జనం విజయవంతంగా, ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని, భక్తి, భద్రత, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించి, భవిష్యత్తులో అందరూ సంతోషంగా గుర్తుచేసుకునేలా గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని, మండప నిర్వాహకులు పోలీసులు మరియు ఉత్సవ కమిటీ సూచిస్తున్న విధంగా నియమ నిబంధనలను పాటిస్తూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు సంతోషంగా, ఆనందదాయకంగా భవిష్యత్తులో అందరు గుర్తుచేసుకునేలా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఆఫీసుద్దీన్, రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ కుమార్, ఎస్ఐలు, ఉత్సవ కమిటీ, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ బాధితులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

మానకొండూర్, సెప్టెంబర్12: క్షయ వ్యాధి (టీబీ)తో బాధపడుతున్న వారికి పౌష్టికాహారం అందించడం అభినందనీయమని అంకిత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కవ్వంపల్లి అనురాధ అన్నారు. ఇటీవల మానకొండూరు పీ.హెచ్.సీలో క్షయ వ్యాధి పీడితులుగా నమోదైన వారికి మాధవి సీడ్స్ అధినేతలు రేమిడి శ్రీనివాసరెడ్డి--సత్యవతి దంపతులు పౌష్టికాహార కిట్లను అందించారు. శనివారం మానకొండూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ అనురాధ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధి సోకిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీకి సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని, వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా మందులు వినియోగించుకోవాలని సూచించారు.టీబీ బాధితులు మందులతో పాటు బలవర్ధకమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. టీబీ బాధితులకు నిత్యావసర సరుకులతో కూడిన పౌష్టికాహార కిట్లను అందించిన రేమిడి శ్రీనివాసరెడ్డి--సత్యవతి దంపతులను డాక్టర్ అనురాధ అభినందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, ప్యాక్స్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, గంగుల రామిరెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, తిరుమలరెడ్డి, బుర్ర శ్రీధర్ గౌడ్, మడుపు ప్రేమ్‌కుమార్, కొండ్ర సురేష్, రేవెల్లి రాజలింగం, కనకం అశోక్, గొల్లెన కొమురయ్య, ఎన్. బాపురావు, బాకారపు సమ్మయ్య, ఎడ్ల శ్రీధర్, బుర్ర శ్రీకాంత్, బక్కారెడ్డి, దూలం దేవేంద్ర, దూలం వీరస్వామి, ఎర్రోళ్ల కవిత, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

అంకిత్ హాస్పిటల్స్‌పై అసత్య ప్రచారాలు నమ్మొద్దు ఎండీ డా. అనురాధ

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్12: పేదలు క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలనే సేవాభావంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న అంకిత్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిపై కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. కవ్వంపల్లి అనురాధ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మానకొండూరు మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న మహిళలకు శనివారం రిపోర్టులను అందజేసి, వైద్యపరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డా. అనురాధ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల పేరుతో రోగులను తమ ఆసుపత్రికి రప్పించుకోవాలనే ఉద్దేశం తమకు ఏ మాత్రం లేదని స్పష్టం చేశారు. ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించి, అవసరమైన సమయంలో సరైన చికిత్స పొందేలా అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు.అయితే, ఉచిత వైద్య శిబిరాలపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. శిబిరాల ద్వారా వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరోగ్యశ్రీ పథకం కింద అన్ని సదుపాయాలు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స, వైద్య సేవలు అందేలా మార్గనిర్దేశం చేయాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆసుపత్రి సేవలను రాజకీయాలకు వేదికగా మార్చి లబ్ధి పొందాలని చూడటం సరికాదన్నారు.సుమారు పదేళ్లపాటు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తికి ఎల్‌వోసీ అంటే ఏమిటో, దాని ద్వారా ఏ ఆసుపత్రిలో చికిత్స, వైద్య సేవలు పొందవచ్చో తెలియకపోవడం శోచనీయమని డా. అనురాధ వ్యాఖ్యానించారు.గత నెల 23న ఎం ఎన్ జే , అంకిత్ హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 500 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. పరీక్షల్లో కొంతమందికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని, అర్హులైన వారు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డా. అనురాధ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, ప్యాక్స్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, గంగుల రామిరెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, తిరుమల రెడ్డి,బుర్ర శ్రీధర్ గౌడ్, మడుపు ప్రేమ్ కుమార్, కొండ్ర సురేష్, రేవెల్లి రాజలింగం,కనకం అశోక్, గొల్లెన కొమురయ్య, ఎన్ బాపురావు, బాకారపు సమ్మయ్య, ఎడ్ల శ్రీధర్, బుర్ర బుర్ర శ్రీకాంతు దూలం దేవేంద్ర, దూలం వీరస్వామి, ఎర్రోళ్ల కవిత, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

మనస్సును, శరీరాన్ని ఏకం చేసేదే యోగ

జీఎంలు సుంకర మధుసూదన్, కొలిపాక నాగేశ్వరరావు

రామగిరి, సెప్టెంబర్ 12:- మనసును, శరీరాన్ని ఏకం చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేదే యోగ అని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు.శనివారం జీఎం కార్యాలయంలో పరివార్ యోగా వారి ఆధ్వర్యంలో యోగా గురుజి రఘు సింగ్ బాపూజీ యోగ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందికి యోగాసనాలు, వాటి ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జీఎంలు మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చన్నారు. ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఏకాగ్రత, శారీరక దృఢత్వం పెంపొందించడంలో యోగా ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటుఐఐలు యం.రామ్మోహన్, బండి సత్యనారాయణ, విభాగాధిపతులు బి.సుదర్శనం, సి.హె.సురేష్, కె.ఐలయ్య, అఫ్జర్ పాషా, ఆర్.రాజేశ్వర్, షబ్బీరుద్దీన్, మాజీ అధికారి ఐ.లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి ఆకృతిలో విద్యార్థుల విన్యాసం



మేడ్చల్, సెప్టెంబర్ 12: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నాగారంలోని సెరినిటీ విద్యార్థులు వినాయకుడి ఆకృతిలో వినూత్న విన్యాసం నిర్వహించారు. విద్యార్థులు క్రమబద్ధంగా నిలబడి గణనాథుడి ఆకృతిని రూపొందించడం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సెరినిటీ ముఖ్య కార్యదర్శి నోముల వసంత రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. మట్టి విగ్రహాలతో ప్రకృతికి, నీటి వనరులకు ఎలాంటి హాని కలగదని, పర్యావరణహిత పండుగలను నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల చైతన్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటిచెప్పారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవ వేడుకలు

ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులు

మహేశ్వరం సెప్టెంబర్ 12): గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఐదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కందుకూరు మండలం బాచుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బొడ్రాయికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్యపూజలు, అభిషేకాలు నిర్వహించి బొడ్రాయికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో సుఖశాంతులు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని బొడ్రాయిని ప్రార్థించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం బొడ్రాయి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కమ్మరి నరేష్, వార్డు మెంబర్ మానస శ్రీనివాస్ ఎర్ర ప్రభు ప్రమీల, కీర్తి కుమార్ రెడ్డి, కత్తుల వెంకటేష్, కుమ్మరి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణేష్‌ను ప్రతిష్ఠిద్దాం...ప్రకృతిని పరిరక్షిద్దాం: కాల్వ మల్లేశం

తిమ్మాపూర్, సెప్టెంబర్12: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులో స్థానిక కార్పొరేటర్ కాల్వ మల్లేశం ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి గణేష్ విగ్రహాలను శనివారం పంపిణీ చేశారు.కాల్వ మల్లేశం మాట్లాడుతూ....ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యతగా, రసాయనాలతో తయారు చేసిన గణేష్ విగ్రహాలను ఉపయోగించవద్దని, రసాయన రంగులు నీటిని కలుషితం చేసి పర్యావరణానికి హాని చేస్తాయని కనుక ప్రతి ఇంట్లో మట్టి గణేష్‌ను ప్రతిష్ఠించి పండుగను భక్తితో జరుపుకుంటూ ప్రకృతిని కూడా కాపాడుకోవాలని కాల్వ మల్లేశం సూచించారు.సింగిల్ విండో మాజీ చైర్మన్ సింగిరెడ్డి స్వామి రెడ్డి రైతు సమితి అధ్యక్షులు కంది రామచంద్రారెడ్డి పార్టీ డివిజన్ అధ్యక్షుడు సల్ల మహేందర్, యూత్ అధ్యక్షుడు గట్టెపల్లి దీపక్, సీనియర్ నాయకులు బల్మరి నరసింహారెడ్డి, తమ్మనవేని అంజి,ఎంపిటిసి అంజి, దాసం కమలాకర్, శిల వరుణం, తొర్తి ప్రశాంత్, లంక రవి, వేణు, నిఖిల్, ఎర్రవ్ అనంతరెడ్డి, సంపత్, పరకుం చందు, ప్రకాష్, మహేందర్, కుమార్ తదితరులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఆరెపల్లి మానస్ కుమార్..

పెద్దపల్లి ప్రతినిధి అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు ఈనెల 8 నుండి 10 వరకు యాదగిరిగుట్టలో నిర్వహించగా, ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆరెపల్లి మానస్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆరెపల్లి మానస్ కుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా గా ఏర్పడిన తరువాత ఎలాంటి కుటుంబ రాజకీయ నేపథ్యం లేకుండా యువజన సంఘంలో చేరి 2017 లో జిల్లా కన్వీనర్ గా, 2020 లో జిల్లా అధ్యక్షులు గా, జిల్లా 2022 లో జిల్లా కార్యదర్శి గా గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పోరాట ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కరించానని, జిల్లా కార్యదర్శిగా మళ్ళీ నూతనంగా బాధ్యత చేపట్టిన తర్వాత అనేకమైన యువజన సమస్యలపై, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నానని, యువజన సంఘం బలోపేతం కోసం జిల్లాలోని అన్ని మండలాలు తిరిగి బలమైన కమిటీలు వేసి నాయకత్వాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో ప్రముఖ పాత్ర వహించానని, విద్యార్థులకు, యువకులకు సంబంధించిన డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించడం, యువత చెడుదారి పట్టకుండా క్రీడలు, మానసిక ఉల్లాసం వైపు మళ్లించేలా వివిధ కార్యక్రమాలు చేపట్టానని అన్నారు.యాదగిరిగుట్టలో జరిగిన ఈ రాష్ట్ర మహాసభలలో తనపై నమ్మకం ఉంచి వివిధ జిల్లాల ప్రతినిధులు తనను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించినందుకు రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున విద్యార్థి, యువకుల, మహిళల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తానని, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎదగడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, తన ఎన్నికకు సహకరించిన సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, పెద్దపల్లి సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం కు విద్యార్థి యువజన నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ం

లోక్ అదాలత్‌లో 479 కేసులు పరిష్కారం

దత్తత అవార్డు అందజేసిన జడ్జి జానకి

ధర్మపురి, సెప్టెంబర్ 12, : లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని న్యాయమూర్తి వై. జానకి తెలిపారు. శనివారం ధర్మపురి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 479 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా దత్తతకు సంబంధించిన కేసును ఇరువర్గాల అంగీకారంతో పరిష్కరించి అవార్డు జారీ చేశారు. భార్య తిరుపతి దత్తత తీసుకునే వారిగా, లావణ్య (దివంగత రమేష్) దత్తత ఇచ్చే వారిగా పేర్కొంటూ దత్తత అవార్డు జారీ చేశారు. అనంతరం న్యాయమూర్తి వై. జానకి సంబంధిత పక్షాలకు దత్తత అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జానకి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయని ఆమె తెలిపారు. కేసు సామరస్యపూర్వకంగా పరిష్కారం కావడంతో ఇరువర్గాలు సంతృప్తి వ్యక్తం చేశారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందెల రమేష్, ఉపాధ్యక్షులు మామిడాల శ్రీకాంత్, లోక్ అదాలత్ సభ్యులు గడ్డం సత్యనారాయణ రెడ్డి, రౌతు రాజేష్, ఏజీపీ ఇమ్మడి శ్రీనివాస్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్, న్యాయవాదులు అప్పాల నిరంజన్ సాంబరాజుల కార్తిక్, కస్తూరి శరత్ కుమార్, కలమడుగు కీర్తి, ఇంచార్జ్ సూపర్ డెంట్ రేగుల చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బొంకూరి కైలాసం తప్పుడు ఆరోపణలు సహించేది లేదు

- ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం హెచ్చరిక
- పెద్దపల్లి ఏసీపీకి వినతి.... పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

పెద్దపల్లి ప్రతినిధి : దళిత, బహుజన, అనగారిన వర్గాల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధుపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని సంఘం జాతీయ,రాష్ట్ర నాయకులు తీవ్రంగా హెచ్చరించారు. అసత్య ప్రచారాలకు పాల్పడుతున్న బొంకూరి కైలాసం అక్రమాల చిట్టాను ఆధారాలతో సహా త్వరలోనే బయటపెడతామని స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ మామిడిపల్లి బాపయ్య, జిల్లా అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్‌లు పాల్గొని మాట్లాడుతూ 50 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘానికి రిజిస్ట్రేషన్ లేదంటూ బొంకూరి కైలాసం చేస్తూన్న ప్రచారం పచ్చి అబద్ధమని నాయకులు కొట్టిపారేశారు. తమ సంఘం 103/77 రిజిస్ట్రేషన్ నంబర్‌తో చట్టబద్ధంగా కొనసాగుతోందని స్పష్టం చేస్తూ, దానికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను విలేకరులకు చూపించారు. అలాగే, అంబేద్కర్ భవనం నిర్మాణం పేరుతో ఒక వ్యక్తి వద్ద రూ. 30 లక్షలు తీసుకున్నారనడంలో ఎలాంటి నిజం లేదని, ఆ భవనానికి సంబంధించిన రెండు ఒరిజినల్ డాక్యుమెంట్లు అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వద్ద భద్రంగా ఉన్నాయని వివరించారు. లీగల్ ప్రామాణికత కలిగిన సంఘంపై, నిస్వార్థంగా పనిచేస్తున్న బొంకూరి మధుపై లేనిపోని నిందలు వేస్తూ, పెద్దపల్లికి రావద్దంటూ బెదిరింపులకు గురిచేయడం కైలాసం కుట్రపూరిత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.గోదావరిఖని పట్టణంలోని ఓల్డ్ అశోక్ టాకీస్ వద్ద అడ్డకూలీగా, తాపీ మేస్త్రిగా జీవితాన్ని ప్రారంభించిన బొంకూరి కైలాసం, సులభంగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతోనే దళిత నాయకుడి అవతారమెత్తాడని నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మహనీయుల ఆశయ సాధన పేరుతో సంఘాన్ని అడ్డం పెట్టుకుని అనేక అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలు పెట్టిస్తానని నమ్మబలికి గుండారం గ్రామానికి చెందిన పలువురు మహిళల నుండి డబ్బులు వసూలు చేశాడని, ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకుని

ఇప్పటివరకు ఎంతో మంది వద్ద వసూళ్లకు పాల్పడిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, త్వరలోనే ఆ చిట్టానంతా బహిర్గతం చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా, కైలాసం నడుపుతున్న సంఘానికి ఎలాంటి రాష్ట్ర లేదా జిల్లా కమిటీలు లేవని, కేవలం భయభ్రాంతులకు గురిచేసేందుకే ఆ పూటకు కొంతమందికి డబ్బులిచ్చి ప్రెస్ మీట్లలో కూర్చోబెట్టుకుంటున్నాడని ఎద్దేవా చేశారు.సంఘం ప్రతిష్టకు భంగం కలిగిస్తూ, కావాలని అభాసుపాలు చేయడానికి ప్రయత్నిస్తున్న బొంకూరి కైలాసంపై పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు పెడతామని, లీగల్‌గా కూడా ముందుకు వెళ్తామని వెల్లడించారు. విలేకరుల సమావేశం అనంతరం నాయకులు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై నరేష్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. కైలాసంపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడంతో, పోలీసులు అతనిపై కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.ఈ విలేకరుల సమావేశంలో సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి పాల రాజేశం, జిల్లా కో-కన్వీనర్లు ఆకునూరి బాల అంకుష్, ఇంటిబిల్లి రవీంద్ర కుమార్, గొట్ట లింగయ్య, నక్క శంకర్, పొనుగంటి రాజనర్సు, బొచ్చు శంకర్, పానుగంటి రాజలింగంలతో పాటు వివిధ మండలాల అధ్యక్షులు కాంపల్లి జీవన్ కుమార్, బొల్లి నందయ్య, నిర్భట్ల రాజయ్య, బొసెల్లి మహేష్, కుక్క అశోక్, ఉప్పులేటి పవన్ కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడండి

- డాక్టర్ కడవెండి వేణుగోపాల్, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12: వినాయక చవితి పండుగ సందర్భంగా డిజేలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వద్దని, మట్టి వినాయకుడు విగ్రహాలను మండపాల్లో ప్రతిష్ట చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని డిజే ధ్వని కాలుష్యం వల్ల వృద్ధులు ఆరోగ్య సమస్యలు ఉన్న వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినాయక మండపాల వద్ద డిజేలకు బదులు భజనలు చేసుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం అని సామాజిక వేత్త డాక్టర్ కడవెండి వేణుగోపాల్, ప్రముఖ డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈరోజు శనివారం ఎకో క్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఆధ్వర్యంలో పేవిలియన్ గ్రౌండ్ ఆవరణలో మట్టి వినాయకులను పూజించాలని పర్యావరణ హితముగా పూజలు చేసుకోవాలి డీజేలు వద్దు, భజనలే ముద్దని సింగల్ యూస్ ప్లాస్టిక్ ని వాడొద్దు, పర్యావరణకు హాని చేయవద్దనే నినాదాలు తెలియజేస్తూ అందరికీ అవగాహన కలిగించటం జరిగినది. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ కమిటీ సభ్యులు మిత్రులంతా మరియు మన ఫ్రీడమ్ పార్క్ మిత్రులు మరియు శ్రీ రక్షా హాస్పిటల్ అధినేత డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు మరియు రాకేష్ దత్త, 3 హెచ్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు మహమ్మద్ ఖలీల్ పాషా,మరియు ఎకో

క్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డా.కడవెండి వేణుగోపాల్ సామాజికవేత్త పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత, బొడ్ల నారాయణరావు, ఎడ్ల నాగేశ్వరరావు ,మాధవరపు శ్రీరామచంద్రమూర్తి పాల్గొని పర్యావరణం గురించి తెలియజేస్తూ అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ కమిటీ సభ్యులు అధ్యక్షులు వి.రామనాథం, యం.దామోదర్ రెడ్డి వి.విజయ్ కుమార్, సొంటి. వెంకట్, మంద వెంకటేశ్వర్లు, ఆకుల. శ్రీనివాస్, సదా శ్రీనివాస్, కె.వి.వి. బాబు, వి.వి. కృష్ణా రావు, భీమ్ రెడ్డి, పెద్ద. దామోదర్ రెడ్డి, చంద్ర శేఖర్, వి.కోటయ్య, గోవర్ధన్, మురళి, మిలిటరీ శ్రీనివాస్ రెడ్డి, డి.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12: రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి, సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ/వైవాహిక వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు. ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని, లోక్ అదాలత్ అనేది వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని, లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, కక్షలు-కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్-విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఇరుపక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ, పోలీసు విభాగం, న్యాయవాదుల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన, ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు, వివాదంలో ఉన్న ఇరువర్గాలకు సమయం, డబ్బుఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న

చిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చుని మాట్లాడుకోవడం వల్ల న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు. పోలీసు శాఖ, బార్ కౌన్సిల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా, ప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నాయని, ఈ సంఖ్యను 10,000 దాటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో పరిష్కారం అయిన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్ట్ న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు కల్పన, శివరంజని, మురళీమోహన్, జ్యోతిర్మయి, రజని, బిందుప్రియ, ప్రవీణ్, నాగలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్ - ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికారుల పనితీరు పై మండిపడ్డ మాజీ కార్పొరేటర్ తోట రామారావు

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్ లో పడకేసిన పారిశుధ్యం పై, కార్పొరేషన్ అధికారుల పని తీరు పై శనివారం మాజీ కార్పొరేటర్ తోట రామారావు మరో సారి మండి పడ్డారు. 48వ డివిజన్ ప్రాంత పరిధి పెద్దదని పూర్తి స్థాయిలో సిబ్బంది లేక పారిశుద్ధ్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిబ్బంది పెంచాలని, విపరీతంగా పెరిగిన చెట్లు, చెత్తను పరిశుభ్రం చేసే విధంగా వారంలో మూడు రోజులు జె సి బి కేటాయించాలని అనేకమార్లు మాజీ ప్రజా ప్రతినిధిగా వినతి పత్రం ఇచ్చిన స్పందించే పరిపాలన లేదని సామాన్య మానవుని పరిస్థితి ఏంటి అని కార్పొరేషన్ అధికారులపై మండిపడ్డారు. కార్పొరేషన్ అధికారులు స్పందించకపోయినా ఈ ప్రాంత మాజీ ప్రజా ప్రతినిధిగా వాళ్ళ సమస్యలపై స్పందించాల్సిన బాధ్యత మాపై ఉందని, ప్రజా ఆరోగ్య దృష్ట మా సొంత నిధులతో అనేకసార్లు జె సి బి ఏర్పాటుచేసి పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టిని సారించామని ప్రస్తుతం మరల సొంత నిధులతోనే జె సి బి ఏర్పాటు చేసుకొని స్థానిక గణేష్ నగర్ ప్రాంతంలో డ్రైనేజు,విపరీతంగా పెరిగిన చెత్తాచెదారులను, వినాయక చవితి పండగను పురస్కరించుకొని గణేష్ మండపాల స్థలాలు కూడా పరిశుభ్రం చేస్తున్నట్టు తెలియజేశారు. గత వారం భగీరథ పైపులైను నిర్మాణంలో కూడా మా సొంత ట్యాంకర్ తో ప్రజలకు ఇబ్బంది లేకుండా మంచినీటి సరఫరా చేయడం జరిగిందని. ఇలా ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యలపై స్పందిస్తూ ఎప్పటికప్పుడు వారి సమస్యల పరిష్కారంలో ఉన్న సందర్భంలో అనేకసార్లు కార్పొరేషన్ అధికారులకు సిబ్బంది విషయం, జె సి బి తదితర అవసరాల నిమిత్తం ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చిన స్పందించకపోవడం చాలా బాధాకరమని తెలియజేస్తూ ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రజలకు అవసరమైన పారిశుద్ధ్యం, మంచినీటిపై తగు చర్య తీసుకోవాలని స్థానిక ప్రజలతో గల మెత్తారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ బాబు, అంజయ్య, గుణ గంటి శ్రీనివాస గౌడ్, యాసారపు ఉపేందర్, తోట రమేష్, చేతి క్రిష్ణ, రమణ, ప్రభాకర్, నవీన్, కిషన్ నాయక్, బాబా తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

సెప్టెంబర్ 15న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

టి ఎహ్ ఎం డబ్ల్యూ యు రాష్ట్ర అధ్యక్షులు కొక్కు సారంగపాణి

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12: హమాలీలకు సమగ్ర చట్టం,సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కు సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 15న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు హమాలీల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని శనివారం ఇల్లందు పాత బస్టాండ్ సెంటర్లో హమాలీల వద్ద కరపత్రాల ద్వారా నిర్వహించిన ప్రచారంలో, మండల పరిధిలోని నిజాంపేట సొసైటీ గోదాం వద్ద పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో సారంగపాణి పాల్గొని మాట్లాడారు.నిత్యం బరువులు మోసే హమాలీల పట్ల పాలకులు వివక్షత చూపుతున్నారని విమర్శించారు. హమాలీలు బరువులు మోయడం వల్ల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలి కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులిచ్చి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 50సంవత్సరాల వయసు దాటిన హమాలీలకు నెలకు 10వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని,ప్రమాద బీమా కల్పించాలని, చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర సదస్సులో ఐఎఫ్టియు జాతీయ ప్రధానకార్యదర్శి టి.శ్రీనివాస్,రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు హాజరై ప్రసంగిస్తారని అన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ జిల్లా నాయకులు తొండల సర్వయ్య, ప్రకాష్, కొడెం రాజు, జి.రాములు, వెంకన్న, మూతి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జోన్ స్థాయి వాయిస్ ఆఫ్ గురు 2026 పోటీలు

ఖమ్మం ప్రతి నిధి, సెప్టెంబర్ 12: ఖమ్మం నారాయణ పాఠశాల ఆధ్వర్యంలో ఖమ్మం జోన్ స్థాయిలో నిర్వహించిన "వాయిస్ ఆఫ్ గురు -- 2026" (ద టీచర్ స్పీకింగ్ ఛాంపియన్షిప్) కార్యక్రమం ఘనంగా జరిగింది . ఉపాధ్యాయులలోని వక్తృత్వ నైపుణ్యాలను వెలికితీసి వారి ఆలోచనలను సమాజానికి చేరవేయాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఖమ్మం జోన్‌కు చెందిన వివిధ నారాయణ పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని విద్య, విలువలు, నాయకత్వం, విద్యార్థుల అభివృద్ధి వంటి అంశాలపై తమ అభిప్రాయాలను సమర్థవంతంగా వ్యక్తపరిచారు. పోటీలు అత్యంత ఆసక్తికరంగా సాగగా, ఉపాధ్యాయుల ప్రసంగ నైపుణ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జోన్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను నిర్వాహకులు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నారాయణ విద్యాసంస్థల ఏ.జి.ఎం ఎస్. రాంకీ, ఆర్.ఐ క్రాంతి కుమార్, కోఆర్డినేటర్ వినోదలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపల్ జి.నవీన్ కుమార్, లైఫ్ స్కిల్స్ ట్రైనర్ నరేష్ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు కొనసాగించడమే ఎస్ఐఆర్ లక్ష్యం

సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు

రామగిరి, సెప్టెంబర్ 12:- ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు కొనసాగించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రధాన లక్ష్యమని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు తెలిపారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీలో శనివారం సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటరు వివరాల్లో తేడాలు ఉన్నవారు సంబంధిత ఆధారాలు, ధ్రువపత్రాలను సమర్పించి వివరాలను సరి చేసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులోగా హియరింగ్‌కు హాజరై అవసరమైన పత్రాలను సమర్పించాలని కోరారు. ఇంటి పేరు, ఓటరు పేరు, వయస్సు తదితర వివరాల్లో తేడాలు ఉన్నవారు సంబంధిత ఆధారాలను సమర్పించి వివరాలను సరి చేసుకోవాలని సూచించారు. అలాగే 2002 నాటి ఓటరు జాబితాలో తమ కుటుంబ సభ్యుల వివరాలను మ్యాపింగ్ చేసుకోవాలని తెలిపారు. నోటీసులకు స్పందించకుండా, నిర్ణీత గడువులోగా అవసరమైన పత్రాలు సమర్పించకపోతే ఓటరు జాబితాలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లు తమకు కేటాయించిన హియరింగ్ తేదీన సంబంధిత ఆధారాలు, అవసరమైన సర్టిఫికెట్లు, ఫారంతో హాజరుకావాలని అధికారులు తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. గ్రామసభలో ఓటర్లు అడిగిన పలు సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఓటరు వివరాల సవరణ, అవసరమైన ధ్రువపత్రాలు, హియరింగ్ ప్రక్రియ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగుల సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడి అగ్రిమెంట్లు సాధించాం

● జనరల్ బాడీ సమావేశంలో వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 12: సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఏఐటీయూసీ సాగిస్తున్న పోరాటాలకు కార్మికుల నుంచి విశేష మద్దతు లభిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్,అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య అన్నారు. కొత్తగూడెం, కార్పొరేట్, సత్తుపల్లి ఏరియాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 8 గంటలవారకు శేషగిరిభవన్‌లో జనరల్ బాడీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించబడింది. జూన్ 8న ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు నేపథ్యంలో ఆర్ఎల్‌సీ సమక్షంలో సింగరేణి యాజమాన్యంతో నిర్వహించిన వరుస చర్చల ద్వారా 23 కీలక డిమాండ్లపై అగ్రిమెంట్లు సాధించామని సీతారామయ్య,రాజ్ కుమార్,మిరియాల రంగయ్య తెలిపారు. పెర్క్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ యాజమాన్యం భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహణ, 2025--26 వాస్తవ లాభాలను దసరాలోపు ప్రకటించేందుకు చర్యలు, బదిలీల్లో మూడేళ్ల నిబంధనకు బదులుగా ఖాళీల ఆధారంగా ఏడాది నిబంధన అమలు, అర్హులైన మైనింగ్ స్టాఫ్‌కు ఓవరన్ ప్రమోషన్లు వంటి పలు అంశాల్లో యాజమాన్యం అంగీకరించిందన్నారు.కార్మికుల వైద్య అవసరాల కోసం హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, మెడికల్ అటెండెన్స్ నిబంధనల సవరణ, సర్వీసు నుంచి దిగిపోయిన కార్మికులకు ఓపీతో పాటు వారం రోజుల వరకు వైద్య సేవలు, సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు, గనుల్లో సేఫ్టీ మెటీరియల్ సకాలంలో అందుబాటులో ఉంచడం వంటి అంశాలపై కూడా అంగీకారం సాధించామని వివరించారు.డిస్మిస్ కార్మికుల పెండింగ్ కేసులను హెచ్‌పీసీ కమిటీ ద్వారా పరిష్కరించడం, అర్హులైన మైనింగ్ స్టాఫ్‌కు సర్ఫేస్‌లో సూటబుల్ ఉద్యోగాలు, కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ వైద్యం, పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల పరిష్కారం, ఉద్యోగులకు ఈవెనింగ్ కాలేజీలకు ఎన్ఓసీలు, ఖాళీ పోస్టుల భర్తీ, క్యాడర్ స్కీమ్ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కూడా యాజమాన్యం సానుకూలంగా స్పందించిందన్నారు. మెడికల్‌గా ఫిట్ అయిన 149 మంది డిపెండెంట్లకు నెల రోజుల్లోపు ఆఫీస్ ఆర్డర్లు జారీ చేయాలని అంగీకారం కుదిరిందన్నారు. సొంత ఇంటి పథకంపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోవడం, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించడం,

చట్టబద్ధమైన సమ్మెల్లో పాల్గొనే కాంట్రాక్ట్ కార్మికులపై నో వర్క్ నో పే మాత్రమే అమలు చేసి అదనపు జరిమానాలు విధించకుండా చూడడం వంటి అంశాలపైనా అంగీకారం సాధించామని తెలిపారు. ప్రచారం కాదు పోరాటమే ఏఐటీయూసీ విధానం కార్మికుల సమస్యలను కేవలం ప్రకటనలకు పరిమితం చేయకుండా సమ్మె నోటీసు ఇచ్చి, ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చలు జరిపి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చి అగ్రిమెంట్లు సాధించామని సీతారామయ్య అన్నారు.ఏఐటీయూసీ సాధిస్తున్న విజయాలను చూసి ఓర్వలేక కొన్ని సంఘాలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు.ఇతరుల పోరాట ఫలితాలను తమవిగా చెప్పుకోవడం సులభమే కానీ యాజమాన్యం ముందు నిలబడి కార్మికుల హక్కుల కోసం పోరాడి అగ్రిమెంట్లు సాధించడం అంత సులభం కాదన్నారు.అగ్రిమెంట్లు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు ఏఐటీయూసీ పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికులకు రావాల్సిన ప్రతి హక్కు, ప్రతి ప్రయోజనం అందే వరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు రమణమూర్తి, జక్కుల గట్టయ్య, సముద్రాల సుధాకర్, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, కత్తెర్ల రాములు, భీమయ్య, సహాయ కార్యదర్శులు రాము, సూర్యప్రకాశ్, కాంట్రాక్ట్ వర్కర్స్ ఇన్‌చార్జి ఎర్రగాని కృష్ణయ్య, ఆఫీస్ బేరర్లు, అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల పిట్ సెక్రటరీలు, వివిధ కమిటీల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

దళిత స్పీకర్ ను బిఆర్ ఎస్ నేతలు అవమానించడం అత్యంత దారుణం

● బిఆర్ఎస్ నేతల కోసమే 22,ఎ, చట్టాన్ని తీసుకొచ్చాం ● మహేశ్వరం అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్చార్జి మాజీ శాసన సభ్యులు కేఎల్ఆర్

మహేశ్వరం సెప్టెంబర్ 12, : దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను బిఆర్ ఎస్ పార్టీ అవమానించడం అత్యంత దారుణమైన విషయమని మహేశ్వరం అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి విమర్శించారు. రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మహేశ్వరం మండల తుక్కుగూడ లో భిఆర్ఎస్ పార్టీ నేతలు దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ను అవమానించినందుకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తో కలిసి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ ముందు ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తే ఆ ప్రాంతంలో ఆ పార్టీ నేతలు పసుపు నీళ్లు చల్లారంటే ఎంత ఘోరంగా దళితులను అవమానిస్తున్నారని వారు మండిపడ్డారు. బిఆర్ఎస్ నేతల భూముల విషయం బండారం బయట పెట్టడానికే 22,ఎ, చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. దొంగ ఓట్లతో స్థానికంగా గెలిచిన ఎమ్మెల్యే ఏం మాట్లాడుతున్నారో ఆమెకే అర్థం కాకుండా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. నాడు ఫార్మా ఎందుకన్నా వారు ఇప్పుడు ఎందుకు కావాలంటున్నారో ప్రజలకు వివరించాలని వారు ప్రశ్నించారు. బిఆర్ఎస్ నేతలు యువకులు ఉంటే ఎఫ్ సి డి ఏ కి దరఖాస్తు చేసుకొని పరిశ్రమలు నెలకొల్పాలని స్థానిక ఎమ్మెల్యేకు సూచించారు. కేటీఆర్, హరీష్ రావు లాంటి పెద్ద నేతలు వ్యాపారం చేసుకుంటా మంటే కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తుందన్నారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేందుకు తీర్మానాలు ఇవ్వాలని సర్పంచ్లను కోరితే స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సర్పంచులను సంతకాలు పెట్టకుండా అడ్డుపడుతుందని ఆయన ఆరోపించారు. అనంతరం తుక్కుగూడ హైవేపై తాత మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి. మాజీ జిల్లా జడ్పీ చైర్పర్సన్ తీగల అనిత రెడ్డి, దేప భాస్కర్ రెడ్డి, కందుకూరు మాజీ జెడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, గంగారం సర్పంచ్ దేవేందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శలో విద్యార్థులకు మాక్ పోలింగ్: స్కూల్ లీడర్‌తో పాటు పలు పదవులకు ఎన్నికలు

ప్రజాస్వామ్య విలువలపై అవగాహన

భూపాలపల్లి, సెప్టెంబర్ - 12: కాటారం: విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాధాన్యత, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో శనివారం మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై ప్రత్యక్ష అనుభవం కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులే అభ్యర్థులుగా, ఓటర్లుగా, పోలింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందిగా వివిధ పాత్రలను పోషించారు. పాఠశాల స్కూల్ లీడర్‌తో పాటు హౌస్ కెప్టెన్స్ , స్పోర్ట్స్ లీడర్ , పలు నాయకత్వ పదవులకు ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్ల గుర్తింపు, ఓటింగ్ విధానం, పోలింగ్ కేంద్రం నిర్వహణ, ఓటు నమోదు, ఈవీఎం వినియోగం, ఎన్నికల నియమ నిబంధనలు తదితర అంశాలను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ప్రత్యేకంగా ఈవీఎంలను ఏర్పాటు చేసి విద్యార్థులతో మాక్ ఓటింగ్ నిర్వహించడం ద్వారా ఎన్నికల ప్రక్రియపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్‌కు ముందు విద్యార్థులకు ఓటు హక్కు విలువ, ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత, బాధ్యతాయుతమైన ఓటరు పాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. మాక్ పోలింగ్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు, ఎన్నికల నిర్వహణపై పుస్తక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ అవగాహన కలుగుతుంది. చిన్ననాటి నుంచే ప్రజాస్వామ్య విలువలను అర్థం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన ఓటర్లుగా ఎదిగేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు అన్నారు. ఈ

కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాటూరుపేట - దెందుకూరు ఆర్, బి రోడ్డులో ప్రాణాలు తీస్తున్న పిచ్చి మొక్కలు!

- మూలమలుపుల్లో కనిపించని వాహనాలు - ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు

- ఆర్‌డబి అధికారుల నిర్లక్ష్యంపై బిజెపి మండల అధ్యక్షుడు గడ్డ శ్రీహరి

మధిర ప్రతినిధి సెప్టెంబర్ 11: మధిర మండలం మాటూరుపేట నుండి దెందుకూరు వెళ్లే ఆర్‌డబి రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి రోడ్డును పూర్తిగా కమ్మేశాయని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని మధిర మండల బిజెపి అధ్యక్షులు గడ్డం శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా మూలమలుపుల వద్ద పిచ్చి మొక్కల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయన్నారు. ఆర్‌డబి అధికారులు కనీసం మూలమలుపును సూచించే బోర్డులు, రోడ్డు మార్కింగ్ గీతలు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. మధిర నుండి

మాటూరుపేట మీదుగా అనేక గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డుపై ప్రయాణిస్తారని, దెందుకూరు వైపు సుబాబుల్ లోడ్లతో భారీ వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయని, రోడ్డు వెడల్పు తక్కువగా ఉండి తప్పుకోవడానికి వీలు లేకుండా పిచ్చి మొక్కలు పెరగడం ప్రమాదాలకు కారణం అవుతోందన్నారు. కావున ఆర్‌డబి అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు పక్కన దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి....

అవసరమైతే తప్ప బయటికి రాకూడదు - డీసీపీ భూక్య రామ్ రెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి : ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప బయటకు రావద్దని పెద్దపల్లి డిసిపి భూక్య రామ్ రెడ్డి సూచించారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వర్షాల కారణంగా రహదారులు, లోతట్టు

ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు.వాగులు, వంకలు, చెరువులు, కాలువల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, వరద నీటిలో ప్రయాణించే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. వాహనదారులు వర్షాల సమయంలో నెమ్మదిగా ప్రయాణిస్తూ రోడ్డు పరిస్థితులను గమనించాలని సూచించారు.ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని, వర్షాల నేపథ్యంలో పోలీసులు, అధికారులు సూచించే భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని డీసీపీ భూక్య రామ్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు...

గణేష్ ఉత్సవ కమిటీ వారికి అవగాహన సదస్సు నిర్వహించిన సిఐ రమేష్

డీజేలకు పర్మిషన్ లేదు కాదని ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

మధిర ప్రతినిధి సెప్టెంబర్ 12: ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్తు ఆదేశాల మేరకు శనివారం నాడు మధిర టౌన్ పోలీస్ స్టేషన్ నందు గణేష్ నవరాత్రుల సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ వారికి అవగాహన సదస్సును నిర్వహిస్తున్న సిఐ రమేష్... ఈ కార్యక్రమంలో ఎస్సైలు నవిత కిషోర్ తో పాటుగా గణేష్ ఉత్సవ కమిటీ నిర్వహించు నిర్వాహకులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన జిన్నింగ్ మిల్స్ సంఘం ప్రతినిధులకు ఘన సన్మానం..

జమ్మికుంట సెప్టెంబర్ 12 : రాష్ట్ర కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్స్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన దొణకొండ మల్లారెడ్డి, జిల్లా కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్స్ అధ్యక్షుడిగా ఎన్నికైన బచ్చు భాస్కర్‌లను జమ్మికుంట అడ్తిదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు.స్థానిక అడ్తిదారుల సంక్షేమ సంఘ భవనంలో సంఘం మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ నూతనంగా పదవులు చేపట్టిన ఇద్దరు నాయకులు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డుకు పూర్వ వైభవం తీసుకురావడానికి తమవంతు కృషి చేయాలని ఆకాంక్షించారు. వర్తకులు, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు.అనంతరం రాష్ట్ర కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్స్ ఉపాధ్యక్షుడు దొణకొండ మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బచ్చు భాస్కర్ మాట్లాడుతూ జమ్మికుంట మార్కెట్ యార్డు అభివృద్ధికి తమవంతు కృషి తప్పకుండా చేస్తామని తెలిపారు. తమపై అభిమానం చూపించి సన్మానించిన అడ్తిదారుల సంక్షేమ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ వ్యాపారులు, అడ్తిదారులు, దాడ్వాయిలు, హమాలీలు, సంఘ సభ్యులు పాల్గొని నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

జి.యంలు సుంకర మధుసూదన్, కొలిపాక నాగేశ్వరరావు

రామగిరి, సెప్టెంబర్ 12:- మట్టి వినాయక విగ్రహాలను పూజిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు.శనివారం జి.యం.కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, పరిసర గ్రామాల ప్రజల కోసం కూడా ఎన్నో సామాజిక, పర్యావరణ హిత కార్యక్రమాలుచేపడుతుందన్నారు. దానిలో భాగంగానే గత కొద్ది సంవత్సరాలుగా ఉద్యోగులకు, పరిసర గ్రామాల ప్రజలకు వినాయక చవితి పండగను పురస్కరించుకుని ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తుందన్నారు.సింగరేణి సంస్థ మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అందరూ కూడా మట్టితో తయారైన వినాయక విగ్రహాలనే పూజిస్తూ భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రులను ఘనంగా జరుపుకోవాలన్నారు. అందరికీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా సోమవారం ఉదయం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం ఆవరణలో సెంటినరీ కాలనీ వాసులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్ర రెడ్డి, రవి కుమార్, ఏరియా ఇంజనీర్ ఎ. ఉదయ భాస్కర్, పర్యావరణ అధికారులు కిషన్, ప్రశాంత్ జీవన్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, తోపాటు ఇతర విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రైలెళ్ళిపోతుంటే.. చేతులు ముడుచుకుని కూర్చుంటా(రు)రా?

● మళ్లీ ఆగని స్పెషల్ రైలు ● మొదటిసారి ఒక్కరోజు.. రెండోసారి రెండు రోజులు.. మూడు స్టేషన్లకు మొండిచేయి! ● రైలు వస్తే చూసే నాయకులా.. ఆపేందుకు పరుగెత్తే నాయకులా? ● ప్రత్యేక కథనం..

బ్యూరో,: "రాజనొచ్చినాడూ..
పెండ్లి కొడుకు రామబ్రహ్మమొచ్చినాడూ..
వాళ్లతరుపు బంధువులందరొచ్చినారూ..
ఒక్కసారచ్చి పోమ్మా..
మెరుపుతీగ!"
అచ్చం ఇలాగే ఉంది జన సాధారణ్ స్పెషల్ రైలు తీరు!

మొదటిసారి ఒక్కరోజు స్పెషల్‌గా మెరుపుతీగలా వచ్చి.. వెళ్లిపోయింది. ఓదెల మండలంలోని మూడు ముఖ్యమైన రైల్వే స్టేషన్లు పొత్కపల్లి, ఓదెల, కొలనూరు వైపు మాత్రం కన్నెత్తి చూడలేదు.

సరే.. అనుకోకుండా వచ్చిందేమో.. పాపం ఓదెల నాయకులకు ఆ రైలు వచ్చే సంగతి తెలియదు కావచ్చు అనుకుందాం. కానీ రెండోసారి మాత్రం ఈనెల 12, 13 తేదీల్లో రెండు రోజులు స్పెషల్‌గా వస్తున్నట్టు ముందే ప్రకటించారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. రైలు మళ్లీ వచ్చింది.. మూడు స్టేషన్లను మళ్లీ దాటేసింది! పేరు జన సాధారణ్.. హాల్టులు మాత్రం జనానికి దూరం!

సాధారణ ప్రజల కోసం నడిపిస్తున్నామని చెబుతున్న జన సాధారణ్ రైలు.. ఓదెల మండలంలో ఉన్న మూడు ముఖ్యమైన స్టేషన్లలో ఒక్కచోట కూడా ఆగకపోవడం ఈ ప్రాంత నాయకుల పనితీరును చెప్పడంతో పాటు, ప్రయాణికుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది.

పెద్దపల్లి జిల్లాలోని పొత్కపల్లి, ఓదెల, కొలనూరు ప్రాంతాల ప్రజలకు ఈ రైలు ఉపయోగపడాలంటే ఈ స్టేషన్లలో హాల్ట్ అవసరమని ప్రయాణికులు అంటున్నారు. ఈ ప్రాంతంలో నాయకులకు కొదవలేదు. ఎవరికి వారే తోపులు.. తురుం ఖాన్లు. మోచేయి నాది కాదంటే ఢిల్లీ దాకా దేకిచ్చే వాళ్లే. చిన్న చిన్న పనులు చేసి పెద్ద పెద్ద ప్రకటనలు ఇచ్చుకుంటూ.. సోషల్ మీడియాలో పబ్లిసిటీ చేయించుకోవడంలో ముందుండే నాయకులు .. భారీ ప్రయోజనాలు అందించే ఈ రైలు విషయంలో ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు?

రైలు కళ్లముందే వెళ్లిపోతుంటే.. చేతులు పిసుక్కుంటూ, భుజాలు చరుసుకుంటూ, పళ్ళు ఇకిలిచ్చి చూడడమేనా వీళ్లకు సాధ్యమయ్యే పని? మొదటిసారి తెలియలేదనుకుందాం.. రెండోసారి కూడా తెలియలేదా? ఒక్కరోజు స్పెషల్ రైలుకు హాల్ట్ రాలేదు. సరే.. పాపం నాయకులకు సమాచారం లేకపోయిందనుకుందాం. కానీ రెండోసారి రెండు రోజుల పాటు రైలు వస్తుందని ముందే తెలిసినా.. మళ్లీ అదే మూడు స్టేషన్లకు మొండిచేయి చూపిస్తే.. ఇది ఎవరి వైఫల్యం? రైలు వస్తుందని తెలియకపోవడమా? తెలిసినా అడగకపోవడమా? అడిగినా సాధించలేకపోవడమా? ప్రజలు మాత్రం సమాధానం కోరుతున్నారు. రేపు రెగ్యులర్ అయితే.. అప్పుడైనా మేల్కొంటారా? అసలు విషయం ఇక్కడే ఉంది.

ఇది కేవలం రెండు రోజుల స్పెషల్ రైలు కథ కాదు. భవిష్యత్తులో ఇదే రైలు రెగ్యులర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

అలా ఒక జన సాధారణ్ రైలు మండలంలో ఉన్న ఏ ఒక్క స్టేషన్‌లో కూడా ఆగకుండా వెళ్లిపోతుంటే.. ఈ నాయకులంతా ఏం చేస్తున్నట్టు? గుడ్డి గుర్రాలకు పళ్ళు తోముతున్నారా? అంటూ జనాలు నిలదీస్తున్నారు. ఖద్దర్ వేసుకుని గల్లాలు ఎగరవేయడమేనా వీళ్లకు చేతనయ్యే పని? ప్రజలకు ఉపయోగపడే రైలు విషయంలో మాత్రం ఎందుకీ మౌనం? అని విమర్శిస్తున్నారు. జన సాధారణ్‌కు జనాలే దూరమైతే.. ప్రయోజనం ఏమిటి? అందుకే డిమాండ్ ఒక్కటే.. జన సాధారణ్ రైలును రెగ్యులర్ చేయాలి. పోత్కపల్లి, ఓదెల, కొలనూరులో ఆపాలి. రైలు వచ్చి వెళ్లిపోవడం కాదు.. ప్రజల కోసం ఆగాలి! ఏది ఏమైనా జన సాధారణ్ రైలు ఓదెల మండలంలోని మూడు స్టేషన్లలో ఆగకపోవడం మాత్రం ఇక్కడి నాయకత్వ వైఫల్యమే అని ప్రయాణికులు కుండ బద్దలు కొట్టినట్లు విమర్శిస్తున్నారు. రైలు వెళ్లిపోతుంటే చూస్తూ కూర్చోవడం నాయకత్వం కాదు..ప్రజల కోసం రైలును ఆపించేందుకు పరుగెత్తడమే నాయకత్వం!పేరు జన సాధారణ్..రైలు జనాల కోసం..మరి జనాల స్టేషన్లలో హాల్ట్ ఎందుకు లేదు?ప్రశ్న ప్రజలది..సమాధానం నాయకులది.

ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

● గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి ఉత్తమ వైద్య సేవలు అందించాలి జిల్లా కలెక్టర్ దివాకర్ ● మధిర జూనియర్ డిగ్రీ కాలేజీ భవనాలు నిర్మాణ పనులను పరిశీలించారు

మధిర ప్రతినిధి సెప్టెంబర్ 12 : ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం మధిర పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఔషధాల లభ్యత, వార్డుల నిర్వహణ, రోగుల నమోదు విధానం, పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులు, బంధువులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో సేవలు పొందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. రోగులకి సకల సౌకర్యాలు ఉండాలని మధిర హాస్పిటల్లో అన్ని వైద్య సేవలు దొరుకుతాయి అనే విశ్వాసాన్ని నమ్మకాన్ని మధిర ప్రజలకే కాకుండా చుట్టుపక్కల నియోజకవర్గం ప్రజలకి కల్గించాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు, ఇతర మౌలిక వసతులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అత్యవసర మెడిసిన్ తో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిల్వల నిర్వహణ చేపట్టాలని సూచించారు. మందుల కొరత కారణంగా ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన స్టాక్‌ను నిర్వహించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అన్ని రకాల నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఆ లక్ష్య సాధనలో ప్రతి వైద్యుడు, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాతావరణం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు మధిర మండలం కేంద్రంలో నూతనంగా మూడు కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్, నాలుగు కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ అదనపు భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆనతరం మధిర మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణ పనులు, అలాగే ఐటిఐ భవనం, ఏఐటీసీ సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యత తో పూర్తి చేయాలని, సమస్యలుంటే పై అధికారుల దృష్టికి తేవాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో పూర్తి సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మధిర తహసీల్దారు రాంబాబు, విద్యశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరంశెట్టి కిషోర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పారుపల్లి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరినీళ్లు తాగే అలవాటుందా..? ఈ సమస్యలున్న వారు అస్సలు తాగకూడదంట.. ఇక మీ ఇష్టం..

ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఈ తరుణంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం.. ముఖ్యంగా ఎండాకాలంలో చాలామంది డీహైడ్రేషన్ సమస్యతో బాధపడుతుంటారు. వాస్తవానికి.. శరీరంలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ నీటిశాతం తగ్గితే.. అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. బాడీ డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు కొబ్బరి నీరు అమృతంలా పనిచేస్తుంది.. వాస్తవానికి కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఎందుకంటే ఇందులో విటమిన్ సి, విటమిన్ ఇ, ఐరన్, కాల్షియం, కాపర్, ఫాస్ఫరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి.. కొబ్బరినీళ్లు ఎప్పుడు తాగినా తాగినా మంచిదే కానీ.. కొందరికి మాత్రం సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని పేర్కొంటున్నారు వైద్య నిపుణులు.. కొన్ని సమస్యలున్న వారు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. ఏ వ్యాధితో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదో ఇప్పుడు తెలుసుకోండి. కిడ్నీ సంబంధిత వ్యాధులు ఉన్నవారు: కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. మధుమేహ రోగులు: మధుమేహ వ్యాధిగ్రస్తులు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఎందుకంటే దానిలో గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువ. అందుకే.. కొబ్బరినీళ్లు తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి వేగంగా పెరుగుతుంది. అలర్జీ: అలర్జీ బాధితులు కొబ్బరినీళ్లు తాగకూడదు. కొబ్బరి నీరు తాగితే చర్మంపై దురద, మంట, చర్మం ఎర్రబడడం వంటి అనేక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. అధిక రక్తపోటు: అధిక రక్తపోటుతో బాధపడేవారు కూడా సాధ్యమైనంతమేరకు కొబ్బరినీటికి దూరంగా ఉండాలి.. అయితే, వైద్యుల సలహా మేరకు మాత్రం కొబ్బరి నీళ్లు తాగవచ్చు.

కప్పు కాఫీ.. తాగితే అమేజింగ్ అంతే.! వీళ్లు మాత్రం అస్సలు జోలికి వెళ్లొద్దు..

ప్రపంచవ్యాప్తంగా కాఫీ లవర్స్ చాలామందే ఉంటారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కొంతమందికి కాఫీ తాగనిదే రోజు గడవదు. అంతలా ఎడిక్ట్ అవుతారు. ఉదయాన్నే బెడ్ కాఫీ తాగితేనే గానీ తమ రోజు మొదలుపెట్టరు. అయితే కాఫీ లిమిట్‌గా తాగితే ఫర్వాలేదు. కాని అధిక మోతాదులో తీసుకుంటేనే అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా ఈ వ్యాధులు ఉన్నవారు కాఫీని అస్సలు తాగకూడదు. మీరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటే.. అస్సలు కాఫీ తాగొద్దు. కాఫీలో కెఫిన్ శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది మెదడు నరాలపై ప్రభావం చూపిస్తుంది. అలాగే రక్త ప్రసరణ కూడా మందగిస్తుంది. అధిక మొత్తంలో కెఫిన్ శరీరంలోకి చేరితే.. మైగ్రేన్ మరింత ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. మీకు హై-బీపీ ఉన్నట్లయితే.. కాఫీ తాగకండి. కాఫీ తాగడం వల్ల రక్తపోటు స్థాయి మరింతగా పెరుగుతుంది. దాని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అలాగే కాఫీ తాగడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. దీంతో బీపీలో హెచ్చుతగ్గులు ఉండొచ్చు. డయాబెటిక్ పేషెంట్లు కాఫీ తాగడం మానేయాలని చాలామంది ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కాఫీ తాగడం వల్ల డయాబెటిక్ రోగులకు అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర స్థాయి అసమతుల్యంగా ఉన్నవారు కూడా కాఫీ తాగకూడదు. గర్భధారణ సమయంలో కాఫీ తాగడం మంచిది కాదు. కాఫీలో ఉండే కెఫిన్ శాతం మీ శరీరంలోని రక్త ప్రసరణను ప్రభావితం చేస్తుంది. దీని వల్ల కడుపులో పెరుగుతున్న పిండానికి రక్తం సరఫరాలో అసమతుల్యత ఏర్పడుతుంది. ఒకవేళ మీకు ఒత్తిడిని ఎదురుకుంటున్నట్లయితే.. కాఫీ గురించి అస్సలు ఆలోచించొద్దు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కాఫీని ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో కార్టిసోల్ హార్మోన్‌పై అధిక ప్రభావం పడుతుంది. ఇది ఒత్తిడిని మరింత ఎక్కువ చేస్తుంది. కాగా, ఈ వార్త కేవలం పలు అధ్యయనాలు, వైద్య నిపుణుల రీసెర్చ్ ఆర్టికల్స్ ఆధారంగా ప్రచురించింది మాత్రమే. మీరు ఏదైనా డైట్ ఫాలో కావాలన్నా.. డాక్టర్ సలహా కచ్చితంగా తీసుకోండి.

మీ బుజ్జాయి కళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే.. రోజుకొక్కసారి ఇలా చేయండి

మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో కన్ను ఒకటి. చూపు లేని లోకం అంధకారం అని పెద్దలు అందుకే అంటారు. కాబట్టి కంటి సంరక్షణ చాలా ముఖ్యం. ముఖ్యంగా నేటి డిజిటల్ యుగంలో పిల్లలు చిన్నప్పటి నుంచే ఫోన్ స్క్రీన్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో పిల్లల కళ్ళు బాల్యం దశలోనే ప్రమాదంలో పడుతున్నాయి. కాబట్టి చిన్న వయసు నుంచే పిల్లల కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే వయసు పెరిగే కొద్దీ సమస్యలు మరింత తీవ్రతరం అవుతాయి. మీ కంటిపాప చూపును జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం ఆయుర్వేదాన్ని ఆశ్రయించవచ్చు. మంచి కంటి చూపుకు, కంటి సంరక్షణకు ఆయుర్వేద నివారణలు ఎంతో ఉపయోగపడతాయి. తర్పన్ అనేది ఒక రకమైన ఆయుర్వేద చికిత్స. ఇది కళ్ళను తేమగా ఉంచడానికి, దృష్టిని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. ఇది కంటి దురదను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. దీనిని ఎలా వినియోగించాలంటే.. నెయ్యిని కళ్లపై నెమ్మదిగా రాసి, ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కళ్లను కడగాలి. ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల కళ్లకు చాలా మంచిది. కళ్లలోకి చేరే రకరకాల దుమ్ము, కాలుష్య కారకాలను తొలగించి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. అయితే అధిక వేడి, చల్లటి నెయ్యిన కళ్లకు ఎప్పుడూ పూయకూడదు. అలాగే కళ్లపై ప్రత్యక్ష సూర్యకాంతి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల కళ్లలోకి యువి కిరణాలు నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సూర్యుడి నుండి కళ్ళను రక్షించడం కూడా అవసరమే. నేటి యుగంలో పిల్లల ముందు టీవీ, ల్యాప్‌టాప్, మొబైల్ స్క్రీన్‌లు కనిపిస్తున్నాయి. వాటిని నివారించలేం. అయితే పిల్లలను స్క్రీన్‌కు దూరం ఉంచడం మీ చేతుల్లో పనే. ఇది మీ పాపాయి కళ్లను కొంత వరకు కాపాడుతుంది. ఆయుర్వేదం ప్రకారం సోంపు గింజలు తినడం కళ్ళకు ఎంతో మేలు జరుగుతుంది. సోంపు గింజలు నోటి దుర్వాసనను తొలగించడంలో కూడా ఉపయోగపడతాయి. కాబట్టి రోజూ భోజనం తిన్న తర్వాత సోపు తింటే కళ్లకు మేలు చేస్తుంది. అలాగే త్రిఫల, ఉసిరి కళ్లకు చాలా మేలు చేస్తుంది. త్రిఫల పొడి, ఉసిరి పొడి కలిపి మీ చిన్నారికి ఆహారంలో ఇవ్వవచ్చు. దానితో పాటు కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అలవాటు చేయాలి. విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారాన్ని పిల్లలకు తినిపిస్తే కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

పోషకాల్లో తిరుగులేని పొద్దుతిరుగుడు.. తింటే అద్భుతమైన శక్తి

పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ సి, విటమిన్ ఇ, విటమిన్ బి6, ఫైబర్, ఐరన్, జింక్, కాపర్, ఫాస్పరస్ మరియు కాల్షియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ ఎముకలను బలోపేతం చేయడమే కాకుండా మీ జీర్ణవ్యవస్థను కూడా మెరుగుపరుచుకోవచ్చు. అలాగే, అవి డయాబెటిక్ రోగులకు ఔషధం లాంటివి. ఎందుకంటే వీటి సహాయంతో రక్తంలో చక్కెర స్థాయిని నిర్వహించడంలో సహాయపడతాయి. పొద్దుతిరుగుడు పువ్వుకు ఎంత అందం ఉంటుందో, దాని గింజల్లో అంత ఆరోగ్యం దాగివుందని నిపుణులు అంటున్నారు. పొద్దుతిరుగుడు విత్తనాలు ఆరోగ్యానికి వరం లాంటివి. ప్రతిరోజూ వాటిని తినడం వల్ల ఈ అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. నేటి అనారోగ్యకరమైన జీవనశైలిలో, ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం. మీ ఆహారంలో పొద్దుతిరుగుడు విత్తనాలను చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ నుండి రక్తపోటు వరకు నియంత్రించవచ్చు. పొద్దుతిరుగుడులో డైటరీ ఫైబర్, ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఉంటాయి. ఇవి అనేక వ్యాధులలో గొప్ప ప్రయోజనాలను అందిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో అద్భుతమైన ఆరోగ్య నిధి దాగి ఉంది. శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి ఆహారంలో కొన్ని గింజలను చేర్చుకోవడం చాలా మేలు చేస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను ఉపయోగించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యల నుండి మిమ్మల్ని రక్షించడంలో సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవడం ద్వారా, మీరు మలబద్ధకం సమస్య నుండి కూడా ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి వాటిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. మీరు మలబద్ధకంతో బాధపడుతుంటే, ఈ విత్తనాలను తీసుకోవడం ద్వారా మీరు చాలా వరకు ఉపశమనం పొందవచ్చు. పొద్దుతిరుగుడు గింజలు డయాబెటిక్ రోగులకు ఒక ఔషధం లాంటివి., ఎందుకంటే వాటిలో పాలీసాచురేటెడ్ కొవ్వు పుష్కలంగా ఉంటుంది. కార్బోహైడ్రేట్ పరిమాణం తక్కువగా ఉంటుంది. పొద్దుతిరుగుడు విత్తనాలను తినడం వల్ల జీవక్రియ రేటు పెరుగుతుంది. వాటిలో మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో సన్‌ఫ్లవర్ సీడ్స్ రెగ్యులర్ వినియోగం బరువు తగ్గడానికి, స్థూలకాయాన్ని అదుపులోకి తీసుకురావడానికి సహాయపడుతుంది. ఎముకల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో కూడా ఈ విత్తనాలు చాలా మేలు చేస్తాయి. మీరు కూడా కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఎందుకంటే ఇందులో కాల్షియం, మెగ్నీషియం, జింక్ మరియు ఇనుము మంచి మొత్తంలో ఉంటాయి. పొట్టను శుభ్రం చేయడంలో పొద్దుతిరుగుడు గింజలకు మరోకటి పోటీ లేదు. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, శరీరంలోని టాక్సిన్స్‌ను కూడా బయటకు పంపవచ్చు . ప్రతిరోజూ 2 టేబుల్ స్పూన్ల పొద్దుతిరుగుడు విత్తనాలు మీ ఆరోగ్యానికి వరం కంటే తక్కువ కాదు.

నేడు ఆఫ్ఘనిస్తాన్‌తో టీమిండియా టీ20

ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం మ్యాచ్
సవాల్‌గా మారిన తుది జట్టు ఎంపిక

శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు ఇటీవలే జింబాబ్వే పర్యటనను దిగ్విజయంగా ముగించుకుంది. ఈ సిరీస్ ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్ లల్లో చవి చూసిన పరిపూర్ణ ఓటముల గాయాన్ని జింబాబ్వే సిరీస్ కొంతవరకు నయం చేయగలిగింది. ఇక.. మూడు టీ20 మ్యాచ్ ల సిరీస్ ఆడబోతోంది. ఆఫ్ఘనిస్తాన్ తో తలపడబోతోంది. ఈ మూడు మ్యాచ్ లకు ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యాన్ని ఇస్తోంది. అన్ని మ్యాచ్‌లు రాత్రి 7:30 గంటలకు ప్రారంభమౌతాయి. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న టీమిండియా.. జింబాబ్వేపై సాధించిన విజయ పరంపరను కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. తుది జట్టును ఎంపిక చేయడం పెద్ద సవా వాల్‌గా మారింది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ జట్టులోకి తిరిగి రావడంతో ఈక్వేషన్లు మారాయి. జింబాబ్వే పర్యటనకు దూరమైన శాంసన్ ఇప్పటివరకు ఆడిన 14 మ్యాచ్‌ల్లో 180.99 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 400 పరుగులు సాధించాడు. ఇందులో మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి. టీమిండియా ఓపెనింగ్ స్థానం కోసం గట్టి పోటీ నెలకొంది. జింబాబ్వే సిరీస్‌లో వరుసగా రెండు హాఫ్ సెంచరీలు సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అందుకున్న వైభవ్ సూర్యవంశీ వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపే అవకాశం ఉంది. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రస్తుత ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లో అతను కేవలం 11 పరుగులు మాత్రమే చేశాడు. మొదటి మ్యాచ్‌లో అభిషేక్ రాణించకపోతే, మిగిలిన రెండింటికీ సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా పంపే అవకాశం ఉంది. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్ రేసులో ఉన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల రికార్డు ఇన్నింగ్స్‌తో ఇషాన్ తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు. దీంతో అతను నాలుగో స్థానంలో ఆడే అవకాశాలు ఉన్నాయి. ఇక మిడిల్ ఆర్డర్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ జట్టుకు వెన్నెముకగా నిలవనున్నారు. ఆల్‌రౌండర్ కోటాలో ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై తర్జన భర్జన జరుగుతోంది. శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిల్లో ఒకరికి అవకాశం దక్కొచ్చు. ఎవరిని ఆడిస్తారనేది పిచ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. బ్యాటింగ్ డెప్త్ పెంచాలనుకుంటే దూబే వైపు, బౌలింగ్ ఆప్షన్ వైపు మొగ్గు చూపితే నితీష్ రెడ్డిని ఎంపిక చేసే అవకాశం ఉంది. బౌలింగ్ విభాగంలో మేనేజ్‌మెంట్ జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై దృష్టి సారించింది. అర్ష్‌దీప్ సింగ్, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ ఈ మ్యాచ్ లో కీలకం కానున్నారు.

చెన్నై యాజమాన్యం క్లారిటీతో తెరపడిన ఉత్కంఠ

చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో ధోనీ వాటాలు కోరారనే ప్రచారం క్రీడా వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం రేపింది. ఈ ఊహాగానాలపై సీఎస్కే యాజమాన్యం అధికారికంగా స్పందిస్తూ స్పష్టత ఇచ్చింది. అదే సమయంలో కొత్త కోచ్ ఎంపిక, రాబోయే ఐపీఎల్ వ్యూహాలపై కూడా కీలక సమాచారం వెలువడింది. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో వాటాలను కొనుగోలు చేయడానికి ధోనీ ఆసక్తి చూపించారని, అయితే ఆయన పెట్టిన షరతులకు యాజమాన్యం అంగీకరించలేదని కొన్ని వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ ప్రచారంపై సీఎస్కే పెద్ద అధికారి ఒకరు తీవ్రంగా స్పందించారు. ధోనీ నుంచి అలాంటి ప్రతిపాదన ఏది తమ వద్దకు రాలేదని, ఆయనతో దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. ఎన్ శ్రీనివాసన్‌తో ఆయన వ్యక్తిగతంగా మాట్లాడారో లేదో తమకు తెలియదని వివరించారు. గతంలో సీఎస్కే షేర్లు ప్రైవేట్ విక్రయానికి అందుబాటులో ఉన్న సమయంలో ధోనీ కొన్ని షేర్లను కొనుగోలు చేసిన మాట నిజమేనని ఫ్రాంచైజీ వర్గాలు వెల్లడించాయి. ఈ షేర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించబడవు కాబట్టి ప్రైవేట్‌గానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ధోనీ వద్ద లక్షకు పైగా షేర్లు ఉన్నప్పటికీ, మొత్తం ఫ్రాంచైజీ వాటాతో పోలిస్తే అది చాలా చిన్న భాగం మాత్రమే. ప్రస్తుతం శ్రీనివాసన్ కుటుంబం వద్దే 55 శాతానికి పైగా ప్రైవేట్ వాటాలు భద్రంగా ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ధోనీ సెప్టెంబర్ 22 నాటికి భారత్‌కు తిరిగి రానున్నారు. ఆయన స్వదేశానికి చేరుకున్న వెంటనే ఐపీఎల్ 2027 వేలానికి సంబంధించి, అలాగే ఆటగాళ్ల ట్రేడింగ్, బదిలీలపై సీఎస్కే యాజమాన్యం ఒక కీలక సమావేశం నిర్వహించనుంది. ప్రధానంగా సీఎస్కే కొత్త హెడ్ కోచ్ ఎంపికలో ధోనీ పాత్ర అత్యంత కీలకం కానుంది. ఒక విదేశీ దిగ్గజ ఆటగాడిని కోచ్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అభిమానుల్లో ఎన్నో సందేహాలు ఉన్నప్పటికీ ధోనీ, సీఎస్కే బంధం ఎప్పటిలాగే బలంగా ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో జరగబోయే సీఎస్కే సమావేశం తర్వాత కొత్త కోచ్ ఎవరనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా సిరాజ్

రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌కు హైదరాబాద్ జట్టు కొత్త ఉత్సాహంతో సిద్ధమవుతోంది. భారత స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు జట్టు పగ్గాలు అప్పగించింది హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ). 2026-27 సీజన్‌లో హైదరాబాద్‌కు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. చామా మిలింద్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో త్రిపురతో హైదరాబాద్ తలపడనుంది. హైదరాబాద్ ఎలైట్ గ్రూప్-బీలో ఉంది. సౌరాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అసోం, త్రిపుర ఈ గ్రూపులో ఉన్నాయి. ఇటీవల శ్రీలంక పర్యటనలో సిరాజ్ ఆశించిన స్థాయిలో వేగం చూపలేకపోయాడు. సాధారణంగా గంటకు 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేసే అతడు.. అక్కడ 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడు. రెండు మ్యాచ్‌ల్లో 44 ఓవర్లు వేసి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. రెండు నెలల విరామం తర్వాత నేరుగా మ్యాచ్ ఆడటంతో తన బౌలింగ్ లయ దెబ్బతిన్నట్లు సిరాజ్ తెలిపాడు. రన్‌అప్‌లో అడుగులు సరిగ్గా పడకపోవడంతో వేగం తగ్గిందని చెప్పాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో మాత్రం సిరాజ్ తిరిగి లయ అందుకున్నాడు. శ్రీలంక నుంచి వచ్చిన కొన్నిరోజులకే చెన్నై మ్యాచ్ ఆడినా.. దేశం తరఫున ఆడేటప్పుడు సాకులు చెప్పకూడదని స్పష్టం చేశాడు. జట్టు కోసం పూర్తి స్థాయిలో కష్టపడటమే తనకు ముఖ్యమని చెప్పాడు. ఇప్పుడు హైదరాబాద్ కెప్టెన్‌గా సిరాజ్ ముందు మరో సవాలు ఉంది. నాయకత్వంతో పాటు బంతితోనూ సత్తా చాటేందుకు అతడికి రంజీ సీజన్ మంచి అవకాశం కానుంది.

మరో కొత్త అవతారమెత్తనున్న కేన్ మామ
కామెంటేటర్ గా సందడి చేసే అవకాశం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అనగానే వార్నర్ తో పాటు టక్కున గుర్తొచ్చే పేరు కేన్ విలియమ్సన్. అయితే విలియమ్సన్.. ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయిన సంగతి తెలిసిందే. దీంతో తెలుగు క్రికెట్ అభిమానులంతా నిరాశ వ్యక్తం చేశారు. అయితే ఇప్పుడు అతడు అన్ సోల్డ్‌గా మిగిలిపోయినప్పటికీ.. 18వ సీజన్ లో సందడి చేసేందుకు సిద్ధం కానున్నాడు.అయితే ఈ సారి ఆటగాడిగా కాకుండా, కేన్ మామ మరో కొత్త అవతారమెత్తనున్నాడు. కామెంటేటర్ గా క్రికెట్ అభిమానులకు కనిపించనున్నాడు. ఈ విషయాన్ని బ్రాడ్ కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ అనౌన్స్ చేసింది. తాజాగా స్టార్ స్టడెడ్ కామెంటేటరీ ప్యానెల్ ను ప్రకటించింది స్టార్ స్పోర్ట్స్. ఇందులో కేన్ విలియమ్సన్ పేరు కూడా ఉండటం విశేషం. కాగా, కేన్ విలియమ్సన్.. రెండు సార్లు ఐపీఎల్ విన్నింగ్ టీమ్ లో భాగస్వామిగా ఉన్నాడు. 2016లో డేవిడ్ వార్నర్ నాయకత్వంలో గెలిచిన సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులో ఉండగా.. 2022లో ట్రోఫీని ముద్దాడిన గుజరాత్ టైటాన్స్ టీమ్ లో ఉన్నాడు. వీరేంద్ర సెహ్వాగ్, శిఖర్ ధావన్, హర్భజన్ సింగ్, అనిల్ కుంబ్లే, సురేశ్ రైనా, కేన్ విలియమ్సన్, ఏబీ డివిలియర్స్, ఆరోన్ ఫించ్, రాబిన్ ఉతప్ప, అంబటి రాయుడు, మహ్మద్ కైఫ్, పీయూష్ చావ్లా, సునీల్ గావస్కర్, నవజ్యోత్ సింగ్ సిద్ధూ, ఆకాశ్ చోప్రా, సంజయ్ మంజ్రేకర్ చోప్రా, మైఖేల్ క్లార్కే, మ్యాథ్యూ హేడెన్, మార్క్ బౌచర్, ఆర్పీ సింగ్, షేన్ వాట్సన్, సంజయ్ బంగర్, వరుణ్ ఆరోన్, ప్రజ్ఞాన్ ఓజా, అజయ్ జడేజా.

309 ఇన్నింగ్స్‌ల్లో 69వ అర్ధశతకం

చరిత్ర సృష్టించిన ఇంగ్లాండ్ కెప్టెన్ రూట్

రెడ్ బాల్ క్రికెట్‌లో ఇంగ్లాండ్ రన్‌మెషీన్ జో రూట్ తన సూపర్ ఫామ్ కొనసాగిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యధిక అర్ధశతకాలు సాధించిన బ్యాటర్‌గా టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డును రూట్ బద్దలు కొట్టాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ బాదడం ద్వారా రూట్ తన కెరీర్‌లో 69వ టెస్టు ఫిఫ్టీని నమోదు చేసుకున్నాడు. సచిన్ టెండూల్కర్ 329 ఇన్నింగ్స్‌ల్లో 68 ఫిఫ్టీలు సాధించగా, రూట్ కేవలం 309 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మార్కును దాటేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో జో రూట్ మరో భారీ మైలురాయిని చేరుకున్నాడు. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో 1000 ప్లస్ టెస్టు పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా చరిత్ర పుటలకెక్కాడు. ఒకే వేదికపై నిలకడగా పరుగులు రాబడుతూ ప్రత్యర్థి బౌలర్లకు సింహస్వప్నంగా మారిన రూట్, ఈ మైదానంలో ఇంగ్లాండ్‌కు అనేక చారిత్రాత్మక విజయాలను అందించడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగు వేర్వేరు క్రికెట్ వేదికల్లో 1000 కంటే ఎక్కువ టెస్టు పరుగులు సాధించిన ప్రపంచంలోనే మూడో క్రికెటర్‌గా జో రూట్ నిలిచాడు. గతంలో లార్డ్స్ (2203 రన్స్), మాంచెస్టర్ (1128 రన్స్), ది ఓవల్ (1050 రన్స్) మైదానాల్లో వెయ్యికి పైగా పరుగులు చేసిన రూట్, ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ (1000ం రన్స్)ను కూడా ఆ జాబితాలో చేర్చాడు. క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికా దిగ్గజం జాక్వెస్ కల్లిస్, ఆస్ట్రేలియా గ్రేట్ రికీ పాంటింగ్ మాత్రమే ఈ ఘనత సాధించగా, ఇప్పుడు రూట్ వారి సరసన నిలిచాడు.కాగా పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్.. 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఇక ఇంగ్లాండ్, పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఇంగ్లాండ్‌కు చెందిన ఓలీ రాబిన్సన్, పాక్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ నిలిచారు.

బుమ్రాను ఎదుర్కొనేందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి

ధీమా వ్యక్తం చేసిన ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్

గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వస్తున్న టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడానికి తమ వద్ద ప్రత్యేక వ్యూహాలున్నాయని ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం (సెప్టెంబరు 13) అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనున్న తొలి టీ20కి ముందు జద్రాన్ మీడియాతో మాట్లాడాడు. బుమ్రా రాకతో భారత బౌలింగ్ విభాగం పటిష్ఠంగా మారినప్పటికీ, అతడిని సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశాడు. "జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో ఒకడు. నాకు ఇష్టమైన ఫాస్ట్ బౌలర్ కూడా అతడే. అయితే మేం ఏ విషయాన్నీ క్లిష్టంగా మార్చుకోం. అతడి కోసం మా వద్ద మంచి ప్రణాళిక ఉంది. అతడి బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలనే దానిపై స్పష్టమైన అవగాహనతో ఉన్నాం. బుమ్రాతో పాటు భారత జట్టుపైనా మెరుగైన ప్రదర్శన చేస్తామని ఆశిస్తున్నాం" అని జద్రాన్ తెలిపాడు. టీమిండియా యువ సంచలనం, లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించామని జద్రాన్ వెల్లడించాడు. "ఐపీఎల్‌లో అతడిని ఎదుర్కొన్న మా జట్టు ఆటగాళ్ల నుంచి కీలక సమాచారం సేకరించాం. ఇప్పటికే అతడి వీడియోలను విశ్లేషించాం. సరైన సమయంలో సరైన ప్రణాళికలను అమలు చేయడంపైనే మా దృష్టి ఉంది" అని వివరించాడు. భారత్‌లో ఆడటం తమకు కొత్తేమీ కాదని, ఇక్కడి పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉందని జద్రాన్ అన్నాడు. "గతంలో టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్‌లతో పాటు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడాం. 2024లో బెంగళూరులో జరిగిన టీ20లో రెండు సూపర్ ఓవర్ల వరకు మ్యాచ్ సాగింది. భారత్‌పై మేం ఎప్పుడూ మెరుగైన క్రికెట్ ఆడాం. అయితే ఇప్పటివరకు వారిపై సిరీస్ గెలవలేదు. ఈసారి ఆ రికార్డును బద్దలు కొట్టి సిరీస్ గెలవడమే మా లక్ష్యం" అని పేర్కొన్నాడు.

ఇంగ్లాండ్ గడ్డపై పాక్‌కు ఘోర పరాభవం..

మూడో టెస్టులోనూ పాకిస్థాన్‌కు ఓటమి

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్ జట్టు 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసి పాకిస్థాన్‌కు ఘోర పరాభవాన్ని మిగిల్చింది. కెప్టెన్‌గా జో రూట్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత తొలి సిరీస్‌నే క్లీన్ స్వీప్ చేయడం గమనార్హం. తొలి రెండు టెస్టులతో పోలిస్తే.. మూడో టెస్టులో పాక్ కాస్త పోరాడినా ఓటమిని మాత్రం తప్పించుకోలేకపోయింది. దీంతో నాలుగు రోజుల్లోనే టెస్ట్ మ్యాచ్ ముగిసింది. 130 పరుగుల స్వల్ప లక్ష్యంతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్‌కు పాకిస్థాన్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ షాక్ ఇచ్చాడు. తొలి బంతికే డకెట్‌ను డకౌట్‌గా వెనక్కి పంపిన అబ్బాస్, అదే ఓవర్లో ఎమిలియో గేని కూడా పెవిలియన్ చేర్చాడు. కేవలం 2 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్‌పై పాక్ పైచేయి సాధించినట్లు కనిపించింది. అబ్బాస్ తన కట్టుదిట్టమైన స్పెల్‌తో ఇంగ్లాండ్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టాడు.అయితే కెప్టెన్ జో రూట్, జోర్డాన్ కాక్స్ కలిసి ఇంగ్లాండ్‌ను ఆదుకున్నారు. పాకిస్థాన్ బౌలర్ల దాడిని తట్టుకుంటూ నెమ్మదిగా స్కోరు బోర్డును ముందుకు నడిపారు. ఈ క్రమంలో పాకిస్థాన్ చేసిన పొరపాట్లు రూట్‌కు బాగా కలసివచ్చాయి. మహమ్మద్ అలీ బౌలింగ్‌లో రూట్ బంతిని వికెట్లపైకి ఆడుకున్నప్పటికీ అది నో-బాల్ కావడంతో బ్రతికిపోయాడు. ఆ తర్వాత స్లిప్‌లో క్యాచ్ డ్రాప్ అవ్వడంతో లభించిన అవకాశాలను రూట్ పూర్తిగా సద్వినియోగం చేసుకుని అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించాడు. ఒత్తిడిని జయించిన జో రూట్, జోర్డాన్ కాక్స్ మూడో వికెట్‌కు 100కు పైగా పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాక్స్ కూడా తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని ఇంగ్లాండ్ విజయాన్ని ఖరారు చేశాడు. చివరికి 24.2 ఓవర్లలో 130/2 పరుగులు చేసిన ఇంగ్లాండ్ సునాయాస విజయాన్ని అందుకుంది. ఈ ఓటమితో పాకిస్థాన్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు గల్లంతయ్యాయి.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 133 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఇంగ్లాండ్ 453 పరుగులు చేసింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో పాక్ బ్యాటర్లు పోరాడారు. దీంతో ఈ సిరీస్‌లోనే తొలిసారి ఆ జట్టు స్కోరు 200 పరుగుల మార్కును దాటింది. చివరకు 449 పరుగులకు ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌట్ అయింది. అనంతరం 130 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి.. సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది.

విశ్వజ

కాఫీ ,టీ... ఈ రెండింటిలో ఏది ఆరోగ్యానికి మంచిదో తెలుసా..?

ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందికి ఉదయం లేవగానే కావాల్సింది ఒక కప్పు వేడివేడి పానీయం. కొందరు కాఫీ లేకుండా రోజు మొదలుపెట్టలేరు, మరికొందరు టీ తో రోజుకు శ్రీకారం చుడతారు. అయితే, ఈ రెండు పానీయాల్లో ఆరోగ్యానికి ఏది ఎక్కువ ప్రయోజనకరమైనది? ఈ ప్రశ్న తరచుగా చర్చకు వస్తుంది. రెండింటికీ వాటివైన ప్రత్యేకతలు, ఆరోగ్య ప్రయోజనాలు, కొన్ని పరిమితులు ఉన్నాయి. వాటిని లోతుగా పరిశీలిద్దాం. కాఫీ: కెఫిన్ ఏకాగ్రతను పెంచి, అలసటను తగ్గిస్తుంది. వ్యాయామం చేసే ముందు కాఫీ తాగడం వల్ల శారీరక పనితీరు మెరుగుపడుతుంది.కాఫీలో క్లోరోజెనిక్ యాసిడ్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి.టైప్ 2 డయాబెటిస్, పార్కిన్సన్ వ్యాధి, లివర్ వ్యాధులు, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో కాఫీ సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. %ూశ్రీంశీ =ఖుం% "మైగ్రేన్ తలనొప్పి వేధిస్తుందా? కారణాలు, లక్షణాలు, నివారణలు ఇవే!" పరిమితులు: సాయంత్రం వేళల్లో లేదా నిద్రకు ముందు కాఫీ తాగితే నిద్రకు భంగం కలగవచ్చు.అధిక కెఫిన్ ఆందోళన, గుండె దడకు కారణం కావచ్చు. కొంతమందికి కాఫీ వల్ల ఎసిడిటీ లేదా కడుపులో మంట రావచ్చు. టీ: టీలో ముఖ్యంగా గ్రీన్ టీ, బ్లాక్ టీలలో ఫ్లేవనాయిడ్లు, కేటెచిన్లు వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. థియానిన్ ఒత్తిడిని తగ్గించి, మెదడులో ఆల్ఫా తరంగాలను పెంచి ప్రశాంతతను కలిగిస్తుంది. టీ క్రమం తప్పకుండా తాగడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. టీలోని కొన్ని సమ్మేళనాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. పరిమితులు: భోజనంతో పాటు టీ తాగితే శరీరంలో ఐరన్ శోషణకు ఆటంకం కలగవచ్చు. తక్కువ మొత్తంలో ఉన్నప్పటికీ, కొంతమందికి టీలోని కెఫిన్ కూడా నిద్రలేమికి కారణం కావచ్చు. మరి ఏది మంచిది? నిజానికి, ఏది "మంచిది" అనేది మీ వ్యక్తిగత ఆరోగ్య లక్ష్యాలు, సున్నితత్వంపై ఆధారపడి ఉంటుంది.మీరు తక్షణ ఉత్సాహం, ఏకాగ్రత కోరుకుంటే, కాఫీ మంచి ఎంపిక.మీరు ప్రశాంతత, దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు, తక్కువ కెఫిన్ కోరుకుంటే, టీ ఉత్తమమైనది. చివరి మాట: రెండూ కూడా మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి ప్రయోజనకరమైనవే. చక్కెర, క్రీములు లేదా పాలు ఎక్కువగా కలపకుండా ఉండటం ముఖ్యం, ఎందుకంటే ఇవి వాటి ఆరోగ్య ప్రయోజనాలను తగ్గించవచ్చు. మీ ఆరోగ్య అవసరాలు, రుచి ప్రాధాన్యతలను బట్టి మీ రోజువారీ పానీయాన్ని ఎంచుకోండి. గుర్తుంచుకోండి, ఆరోగ్యం అనేది కేవలం ఒక పానీయంపై ఆధారపడి ఉండదు, సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, తగినంత నిద్ర కూడా అవసరం!

"గ్రీన్ టీ" తో సైడ్? ఎఫెక్ట్స్..!?
వీరు దూరంగా ఉంటేనే మంచిది..!!

గ్రీన్ టీ. ఇది ఆరోగ్య కరమైనది అందరూ భావిస్తారు. రెగ్యులర్ గా తీసుకునే వారు ఉన్నారు. గ్రీన్ టీ తో మంచి ఎంత ఉందో.. కొందరికి అంత సమస్యలు ఖాయమని తాజా పరిశోధనల ద్వారా వెల్లడి అవుతోంది. అధి కంగా తీసుకోవటం నష్టం చేస్తుందని గుర్తిం చారు. అందులో మందులు తీసుకునే వారు.. కొన్ని అనారోగ్య సమస్యలతో ఉన్నవారు ఈ గ్రీన్ టీని పరిమితంగా తీసుకోవటం మంచింది. మితంగా తీసుకుంటే యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తూ మెలబాలిజం మెరుగు చేస్తుంది. అయితే, అధికంగా తీసుకుంటే మాత్రం ప్రతికూల ప్రభావాలు తప్పవు. గ్రీన్ టీ లో ఔషధ గుణాలు ఉన్నాయనే నమ్మకం ఉంది. అనేక మంది గ్రీన్ టీని ఎక్కువగా వినియో గిస్తూ ఉంటారు. అయితే, ఎక్కువగా గ్రీన్ టీ తీసుకోవటం ద్వారా నిద్రలేమి.. తల నొప్పుల సమస్య లు వస్తాయని చెబుతున్నారు. పరిమితంగా తీసుకున్న వారిలో సమస్యలను తక్కువగా గుర్తించిన ట్లు వెల్లడించారు. రోజుకు ఒకటి లేదా రెండు సార్లు తీసుకునే వారికి సమస్యలు దూరంగా ఉంటా యని పరిశోధకులు వెల్లడించారు. అధిక మోతాదులో తీసుకున్నప్పుడు కాలేయానికి నష్టం కలిగే అవకాశం ఉందని పలు పరిశోధనలో తేలింది. ఇందులో ఉండే కాటెచిన్స్ హెపాటోటాక్సిసిటీకి కారణమవుతుందని నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పేర్కొంది. %ూశ్రీంశీ =ఖుం% "ఆ ఒక్క కారణంతోనే పాక్ తో సీజ్ ఫైర్.. ! అమెరికా వెబ్ సైట్ తో జైశంకర్..!" దీని కారణంగా కాలేయ సమస్యలు ఉన్నవారు గ్రీన్ టీ పరిమితంగా తీసుకోవాలని.. వైద్యుల సలహా మేరకే నడుచుకోవటం మంచింది. గ్రీన్ టీలో ఉండే టానిన్లు శరీరంలో యాసిడ్ స్థాయిలను పెంచ టంతో వికారం, మలబద్ధకం, కడుపులో అసౌకర్యం, రక్తపోటు పెరగడం లాంటి సమస్యలు రావొచ్చని నేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ అధ్యయన నివేదికలో వెల్లడైంది. గ్రీన్ టీ అనేది ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తుందని, దీన్ని ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల ఐరన్ లోపం రావడంతో పాటు అనీమియాకు దారితీస్తుందని పేర్కొంది. బోలు ఎముకల వ్యాధి ఉన్నవారు గ్రీన్ టీకి దూరంగా ఉండే మంచిదని సూచిస్తు న్నారు. గర్భవతులు గ్రీన్ టీ తాగే ముందు సంబంధిత డాక్టర్లును సంప్రదించడం మంచిదని పేర్కొన్నారు.

ఫేస్ క్రీములు అవసరం లేదు, ఈ నీళ్లు ఉంటే చాలు..
మిలమిలా మెరిసిపోతారు అంతే!

చాలా మందికి మండే ఎండలో అందంగా కనిపించాలనే కోరిక ఉంటుంది. అందుకోసం చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. క్రీములు అని, పేస్ ప్యాక్ అని ఏదేదో ప్రయత్నిస్తుంటారు. కానీ అవేమి సరైన ఫలితాలు ఇవ్వక అందరూ నిరాశకు గురవుతుంటారు. అయితే ఎవరైతే అందం మీద ఎక్కువగా ఆశ ఉంటుందో, అందంగా కనిపించాలనే కోరిక ఉంటుందో వారు రోజ్ వాటర్ వినియోగిస్తే చాలా మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది. ఇంతకీ రోజ్ వాటర్ వలన ఎలాంటి ఉపయోగాలు కలుగుతాయి? దానిని ఎలా ఉపయోగించాలి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం. టోనర్: రోజ్ వాటర్ ఒక అద్భుతమైన టోనర్. ఇది చర్మ రంధ్రాలను శుభ్రపరచడానికి, చర్మం %జూఎ% స్థాయిని సమతుల్యం చేయడానికి, చర్మాన్ని మృదువుగా చేయడానికి సహాయపడుతుంది. సైలెంట్ హార్ట్ ఎటాక్..నొప్పి లేకుండానే చంపేస్తది..మీ గుండె భద్రమో కాదో ఇలా తెలుసుకోండి మాయిశ్చరైజర్: రోజ్ వాటర్ చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది పొడి చర్మానికి మంచి మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. దీంతో చర్మం ఎప్పుడూ తాజాగా, తేమగా కనిపిస్తూ ఉంటుంది. మొటిమలు మరియు మచ్చలు: రోజ్ వాటర్‌లో యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి మొటిమలు మరియు మచ్చలను తగ్గించడంలో సహాయపడతాయి. కళ్ళ కింద నల్లటి వలయాలు మరియు వాపు: రోజ్ వాటర్ కళ్ళ కింద నల్లటి వలయాలు మరియు వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. సన్ బర్న్ మరియు చర్మం చికాకు: రోజ్ వాటర్ సన్ బర్న్, చర్మం చికాకును తగ్గించడంలో సహాయపడుతుంది. జుట్టు సంరక్షణ కోసం జుట్టు కండీషనర్: రోజ్ వాటర్ జుట్టును మృదువుగా మరియు మెరిసేలా చేస్తుంది. చుండ్రు నివారణ: రోజ్ వాటర్‌లో యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి చుండ్రును తగ్గించడంలో సహాయపడతాయి. జుట్టు పెరుగుదల: రోజ్ వాటర్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇడ్లీ,దోశ కాదు..మన పూర్వీకులు పొద్దున్నే తిన్నది ఇదే..కొండలను ఢీకొట్టే శక్తి..ఎలా చేసుకోవాలంటే 00:00 రోజ్ వాటర్ మానసిక స్థితిని మెరుగుపరచడానికి మరియు ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. తలనొప్పి ఉపశమనం: రోజ్ వాటర్ తలనొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. నిద్ర నాణ్యతను మెరుగుపరచడం: రోజ్ వాటర్ నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడం: రోజ్ వాటర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

మార్కెట్

ఈవీల ఉత్పత్తికి బ్రేక్!

చైనా నుంచి ఆగిన రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్

న్యూఢిల్లీ : సెమీకండక్టర్ సంక్షోభం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న దేశీయ ఆటో పరిశ్రమను మరో ఉపద్రవం ముంచెత్తబోతున్నాదా! ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. తమ దేశంలో లభించే అరుదైన రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంతో ప్రపంచవ్యాప్తంగా వీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ తాజా పరిణామంతో వాహన ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపి భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈవీ విస్తరణ లక్ష్యాలను దెబ్బపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ ఆటోమోటివ్ తయారీదారులు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ వాహన ఉత్పత్తిలో నిమగ్నమైన వారు అరుదైన భూ అయస్కాంతాల కొరత కారణంగా ఈ ఏడాది జూలై నాటికి తమ ఈవీ వాహనాల ఉత్పత్తిని నిలిపివేయక తప్పదని పరిశ్రమ వర్గాలు సూచించాయి.

ఏమిటీ అరుదైన భూ అయస్కాంతం?

అధునాతన వాహనాలు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్‌లకు అరుదైన భూ అయస్కాంతాలు అత్యంత అవసరం. ఎలక్ట్రిక్ మోటర్లు, బ్రేకింగ్ సిస్టమ్, పవర్ స్టీరింగ్, సమర్ధవంతంగా పనిచేయడం కోసం బలమైన ఆయస్కాంత శక్తిపై ఆధారపడే ఇతర సిస్టమ్‌లకు ఈ భూ ఆయస్కాంతం తప్పనిసరి. ప్రస్తుతం ప్రపంచ దేశాలకు 90 శాతానికి పైగా చైనా నుంచే ఇవి సరఫరా అవుతున్నాయి. కొన్ని అరుదైన మిశ్రమ లోహాలు, శాశ్వత ఆయస్కాంతాల ఎగుమతిపై ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా కఠిన నిబంధనలు విధించింది. జాతీయ భద్రతా ఆందోళనల కారణంగా ఈ చర్యలు తీసుకున్నప్పటికీ, అమెరికా విధించిన ప్రతీకార సుంకాలకు ప్రతిస్పందనగా ఈ చర్య తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

రూ.3వేలు దాటిన యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు..?

ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే జరుగుతున్నాయి. చిన్న మొత్తం నుంచి పెద్ద మొత్తంలో యూపీఐ ద్వారానే లావాదేవీలు జరుపుతున్నారు. గూగుల్‌పే, ఫోన్ పే, పేటీఎం తదితర యాప్స్ సహాయంతో డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారు. టీ దుకాణంలో రూ.10 పెట్టి ఛాయ్ తాగినా సరే యూపీఐ చేసేస్తున్నారు. ప్రస్తుతం భారతదేశంలో ప్రభుత్వం యూపీఐ డిజిటల్ చెల్లింపులను పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. అయితే, త్వరలోనే యూపీఐ లావాదేవీలపై మర్చెంట్ ఛార్జీల విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేటును తిరిగి ప్రవేశపెట్టే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మర్చంట్ టర్నోవర్ కంటే ట్రాన్సాక్షన్ విలువ ఆధారంగానే ఛార్జీలను వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. రూ.3 వేల కంటే ఎక్కువ ఉన్న అన్ని యూపీఐ చెల్లింపులపై ఈ ఛార్జీలను విధించే అవకాశం ఉందని తెలుస్తోంది. చిన్న మొత్తాలపై మాత్రం ఎలాంటి ఫీజులు ఉండవని సమాచారం. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రధానమంత్రి కార్యాలయం, ఆర్థిక వ్యవహారాల శాఖ, ఆర్థిక సేవల విభాగం ఉన్నతాధికారుల మధ్య చర్చల దశలో ఉన్నట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది.

దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు యూపీఐ, రూపే లావాదేవీలపై అన్ని రకాల ఎండీఆర్ ఛార్జీలను ప్రభుత్వం 2022లో రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఛార్జీలను తిరిగి తీసుకురావడం వల్ల యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదని తెలుస్తోంది. ఎందుకంటే ఈ లావేదేవీల కోసం యూజర్ల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరు. కాకపోతే దీనివల్ల వ్యాపారులు మళ్లీ నగదు చలామణికి మొగ్గు చూపే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రికార్డుస్థాయికి యూపీఐ లావాదేవీలు

యూపీఐ.. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దీనిని అభివృద్ధి చేసింది. డిజిటల్ పేమెంట్స్‌లో యూపీఐ సరికొత్త విప్లవం సృష్టించిందని చెప్పొచ్చు. ఇక ఈ ఏడాది యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మే నెలలో రూ.25.14 లక్షల కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఎన్‌పీసీఐ వెల్లడించింది. అంతక్రితం నెలలో జరిగిన రూ.23.94 లక్షల కోట్ల లావాదేవీలతో పోలిస్తే ఐదు శాతం అధికమయ్యాయని తెలిపింది. సంఖ్యాపరంగా చూస్తే 1,867.7 కోట్ల లావాదేవీలు జరిపారు. అలాగే ఏప్రిల్ నెలలో ఇది 1,789.3 కోట్ల లావాదేవీలు జరిగాయి. క్రితం ఏడాది ఇదే నెలలో జరిగిన రూ.20.44 లక్షల కోట్ల యూపీఐ లావాదేవీలతో పోలిస్తే మాత్రం 23 శాతం వార్షిక వృద్ధి నమోదైందని పేర్కొంది.

చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం.. సోషల్ మీడియా ద్వారా యూజర్లు ఫిర్యాదు

ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌బాట్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యూజర్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. దీనిపై యూజర్లు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సమస్య తలెత్తింది. మధ్యాహ్నం 3:15కి సమస్య గరిష్ఠ స్థాయికి చేరింది. మొబైల్ యాప్, వెబ్ రెండింటిలోనూ ఈ సమస్యను ఎదుర్కొన్నట్లు యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. ఏదైనా ప్రశ్నలు వేయగా దాన్ని స్వీకరించేందుకు చాట్ జీపీటీ నిరాకరిస్తోందని, ప్రశ్న తీసుకున్నా త్వరగా స్పందించడం లేదని యూజర్లు పేర్కొంటున్నారు. అంతేకాదు లాగిన్, నెట్‌వర్క్ ఎర్రర్, యాప్ సంబంధిత ఇతర సమస్యలు కూడా ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ సమస్యపై ఇప్పటి వరకూ వెయ్యికి పైగా ఫిర్యాదులు వచ్చినట్లు డౌన్‌డిటెక్టర్ తెలిపింది. 'చాట్ జీపీటీ డౌన్' అంటూ యూజర్లు ఎక్స్‌లో పోస్టులు పెడుతున్నారు. దేశంలో 88శాతం మంది వెబ్ సైట్ ద్వారా చాట్ జీపీటీ వినియోగించే వాళ్లు ఫిర్యాదు చేయగా, 8 శాతం మంది మొబైల్ అప్లికేషన్ ఉపయోగించే యూజర్లు ఫిర్యాదు చేశారు. 2022 చివర్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పని చేసే చాట్‌జీపీటీని ఓపెన్ ఏఐ అందుబాటులోకి తెచ్చింది. ఈ చాట్‌బోట్ సాయంతో యూజర్లు తమకు అవసరమైన ఖచ్చితమైన సమాచారాన్ని సెకన్లలోనే అందుకోవచ్చు.

భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

కొత్తగా 1,010 సీట్లు అందుబాటులోకి

10,450కి చేరిన మొత్తం సీట్ల సంఖ్య

హైదరాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణ వైద్య విద్యలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో కొత్తగా 1,010 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో 2026--27 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని 66 మెడికల్ కాలేజీల్లో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 10,450కి చేరింది. దేశవ్యాప్తంగా మెడికల్ సీట్ల వివరాలతో మెడికల్ అసెస్మెంట్ అండ్ రేటింగ్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన సీట్ మ్యాట్రిక్స్‌లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. తాజా పెంపుతో అత్యధిక ఎంబీబీఎస్ సీట్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఐదో స్థానానికి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 36 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,400 సీట్లు ఉన్నాయి. వీటిలో 4,290 సీట్లు గత సీట్లకు రెన్యువల్ కాగా.. కొత్తగా మరో 110 సీట్లు పెరిగాయి. మహబూబ్‌నగర్, సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 25 చొప్పున, నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్ రిమ్స్‌లో 30 చొప్పున సీట్లు పెరిగాయి. రాష్ట్రంలోని 30 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మొత్తం 6,050 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 5,150 సీట్లు రెన్యువల్ కాగ.., కొత్తగా 900 సీట్లు చేరాయి. కొత్తగా ఏర్పాటైన రాజరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో 150 సీట్లు కేటాయించారు. మిగిలిన సీట్లు ఇప్పటికే ఉన్న పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీట్ల పెంపు ద్వారా అందుబాటులోకి వచ్చాయి. కొత్త సీట్లతో రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య, సీట్ల సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో వైద్య విద్యను జిల్లాల స్థాయికి విస్తరించే ప్రయత్నాలకు ఇది మరింత ఊతమివ్వనుంది. ఎయిమ్స్, జిప్‌మర్ వంటి జాతీయ ప్రాధాన్యం ఉన్న సంస్థలను మినహాయిస్తే దేశవ్యాప్తంగా 836 మెడికల్ కాలేజీల్లో 1,40,214 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో 445 ప్రభుత్వ కాలేజీల్లో 63,971 సీట్లు, 391 ప్రైవేట్ కాలేజీల్లో 76,243 సీట్లు ఉన్నాయి. కొత్త కాలేజీలు, సీట్ల పెంపు ద్వారా ఈ ఏడాది దేశవ్యాప్తంగా 13,186 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. మరో 1,27,028 సీట్లు రెన్యువల్ అయ్యాయి. దేశంలో 15,745 సీట్లతో కర్ణాటక మొదటి స్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్ 14,400, తమిళనాడు 14,299, మహారాష్ట్ర 13,249 సీట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 40 మెడికల్ కాలేజీల్లో మొత్తం 7,615 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. మెడికల్ కాలేజీలు తమకు మంజూరైన సీట్ల మేరకే అడ్మిషన్లు ఇవ్వాలని జాతీయ వైద్య కమిషన్ స్పష్టం చేసింది. ఒక్క సీటు అదనంగా భర్తీ చేసినా ఎన్ఎంసీ చట్టం-2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అవసరమైతే క్రిమినల్ చర్యలతోపాటు జరిమానాలు విధించే అవకాశం ఉందని తెలిపింది. కౌన్సెలింగ్ కమిటీలు కూడా అనుమతించిన సీట్లకు మించి ప్రవేశాలు కల్పించకూడదని స్పష్టం చేసింది. కొత్తగా అనుమతి పొందిన లేదా సీట్లను పెంచుకున్న ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఏడు రోజుల్లోగా ఎంఏఆర్బీ డైరెక్టర్ పేరిట ఎలక్ట్రానిక్ బ్యాంక్ గ్యారంటీ సమర్పించాలని స్పష్టం చేసింది. దాని పరిశీలన పూర్తయిన తర్వాతే లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీ చేయనున్నట్లు ఎన్ఎంసీ వెల్లడించింది.

విదేశాల్లో చదివే విద్యార్థులకు గుడ్‌న్యూస్..

రూ.180 కోట్లు విడుదల చేసిన తెలంగాణ సర్కార్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 : తెలంగాణ ప్రభుత్వం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు భారీ ఊరట కల్పించింది. పెండింగ్‌లో ఉన్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.179.9 కోట్లను తాజాగా విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధుల కేటాయింపు జరిగింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,008 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. విడుదలైన నిధుల్లో అత్యధికంగా ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద 1,063 మంది మైనారిటీ విద్యార్థులకు రూ.76.1 కోట్లు కేటాయించారు. అలాగే, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ద్వారా 1,193 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.48.4 కోట్లు, 573 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.36.9 కోట్లు, మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యా నిధి కింద 179 మంది బీసీ విద్యార్థులకు రూ.18.4 కోట్లు అందజేయనున్నారు. ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తయ్యాయని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో తమ చదువును ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు ఈ నిధులు దోహదపడతాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

'దిల్లీ డిక్లరేషన్'కు ఆమోదముద్ర

బ్రిక్స్ దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం

డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ

పహల్గామ్ దాడిని ఖండిస్తూ బ్రిక్స్ ప్రకటన

పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం

భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ దిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ దిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా హైదరాబాద్

హైదరాబాద్ వైభవాన్నికాపాడుతాం

సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం

మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు

శాసనసభలో క్యూర్?-2026 బిల్లు..

హైదరాబాద్, సెప్టెంబర్ 12 : కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లు-2026ను మంత్రి శ్రీధర్‌బాబు శాసన సభలో ప్రవేశపెట్టారు. హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బిల్లు తెచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టంలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడే విధంగా చేయాలనే ఉద్దేశంతో మూసీ పునరుజ్జీవం చేపట్టామని తెలిపారు. బెంగుళూరు, ముంబై, దిల్లీ మాదిరిగా హైదరాబాద్ మహా నగరపాలిక సంస్థ చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్ విస్తరణ పెద్ద ఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం తీసుకువచ్చినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళ్తున్నామని వివరించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళుతున్నట్లు మంత్రి శ్రీధర్? బాబు తెలిపారు. లక్ష్య సాధనకు హైదరాబాద్ మరింత అధునాతనంగా అంతర్జాతీయ స్థాయికి చేరాలని అన్నారు. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలన్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం ఎదగాలని పేర్కొన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ నినాదంతో రాష్ట్ర అభివృద్ధికి చర్యలున్నాయని గుర్తు చేశారు.క్యూర్' తెలంగాణ ఆర్థిక ప్రగతికి అత్యంత కీలక ప్రాంతమని, రాష్ట్ర విస్తీర్ణంలో చిన్నదైనా తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో క్యూర్ పాత్ర పెద్దదని శ్రీధర్ బాబు వివరించారు. 2025-26లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, క్యూర్ పరిధిలో 10.7 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపారు. ఆర్థిక వ్యవస్థ సేవా రంగానికి సంబంధించి 68.6 శాతం వృద్ధి నమోదైందని అన్నారు. సేవా రంగం, పెట్టుబడులు, ఉపాధికి ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ ఉందని అన్నారు. క్యూర్ పరిధి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ఆర్థిక ఉత్పత్తిలో తొలి 3 స్థానాల్లో ఉన్నాయన్నారు. క్యూర్ ప్రాంతంలో పరిపాలన వ్యవస్థను భవిష్యత్ అవసరాల మేరకు పునర్నిర్మించాలన్నారు. హైదరాబాద్?లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని శ్రీధర్? బాబు తెలిపారు. రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా క్యూర్ చట్టం పని చేస్తుందని అన్నారు. మూసీ పునరుజ్జీవం తొలి దశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు తీసుకున్నట్లు వివరించారు. 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీని త్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నామని, అన్ని సంస్థలు సమన్వయంతో పని చేసేలా చట్టబద్ధ వ్యవస్థగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలక మండలి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక చేస్తున్నామన్నారు. మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగం చేసే దిశగా యోచన చేస్తున్నట్లు చెప్పారు. చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలనే ప్రభుత్వ ఆలోచనలు ఉన్నాయని, హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లు

హైదరాబాద్‌కు క్యూర్-2026 చట్టం

ఇక బిల్లు ఆమోదమే తరువాయి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 : హైదరాబాద్ మహా నగరంలో వేర్వేరు సంస్థలు, వ్యవస్థలతో అస్తవ్యస్తంగా మారిన పరిపాలనను చక్కదిద్దడమే లక్ష్యంగా క్యూర్(కోర్ అర్బన్ రీజియన్)-2026 బిల్లును ప్రభుత్వం శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టింది. ఒకే నగరం, ఒకే పరిపాలన, ఒకే చట్టం నినాదంతో ఈ బిల్లు రూపుదిద్దుకుంది. జీహెచ్ఎంసీ-1955 చట్టం స్థానంలో ప్రభుత్వం ఈ క్యూర్? బిల్లు-2026ను ప్రతిపాదించింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీలకు ఈ చట్టం వర్తిస్తుంది. ఇందులో ఐదు భాగాలు, 43 చాప్టర్లు, 319 సెక్షన్లు, 9 షెడ్యూళ్లు ఉన్నాయి. సీఎం ఛైర్మన్‌గా క్యూర్ పరిధికి అత్యున్నత పరిపాలన మండలి, కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, మరో పది రకాల కమిటీలు ఈ చట్టంలో ఉంటాయి. జీహెచ్ఎంసీ చట్టంలో మాదిరి పరిపాలనలో నగర పాలక సంస్థనే పరిమితం చేయకుండా పోలీసు, హైడ్రా, జలమండలి వంటి ఇతర శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసింది. అక్రమ నిర్మాణాల కట్టడికి జరిమానా, కూల్చివేత, సీజ్ చేయడం, సౌకర్యాల నిలిపివేత అనే నాలుగు రకాల చర్యలు ఇందులో ఉంటాయి. సెక్షన్ 94 ప్రకారం అనుమతిలేని భవన నిర్మాణాలు ఉంటే ఆస్తిపన్నుపై 100 శాతం నుంచి 300 శాతం జరిమానా పడుతుంది. భవనం వినియోగాన్ని మార్చినా ఫైన్ విధిస్తారు. అనుమతి లేని భవనాలకు జీహెచ్?ఎంసీ కమిషనర్ నోటీసు ఇచ్చిన 15 రోజుల్లో చర్యలు ఉంటాయి. అనుమతిలేని భవనాన్ని యజమాని స్వయంగా కూల్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే బల్దియా కూల్చి ఖర్చును ఆస్తిపన్నులో జమచేస్తుంది. ప్రజల భద్రత దృష్ట్యా మున్సిపల్ అధికారులు నోటీసు లేకుండానే భవనాన్ని సీజ్ చేసే అధికారం ఉంది. నివాసయోగ్యపత్రం లేకపోతే భవనానికి కరెంటు, తాగునీరు, మురుగునీటి కనెక్షన్లు మంజూరు చేయకూడదు. అక్రమ నిర్మాణాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22ఏ(1)(ఏ) కింద నిషేధిత జాబితాలో చేర్చాలని ముసాయిదా బిల్లు చెబుతోంది. ఆయా కేసుల్లో ప్రజలు బాధితులుగా మారితే జీహెచ్?ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నిర్ణయాలు, నోటీసులను 30 రోజుల్లో ప్రజలు సవాల్? చేయవచ్చు. ప్రభుత్వం క్యూర్ అప్పిలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేస్తుంది. ఛైర్‌పర్సన్, ఇద్దరి నుంచి నలుగురు పూర్తిస్థాయి సభ్యులతో సివిల్ కోర్టు అధికారాలతో ఈ అథారిటీ విధులు నిర్వహిస్తుంది. సభ్యులను ప్రభుత్వం, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శితో కూడిన సెలక్షన్ కమిటీ నియమిస్తుంది. క్యూర్ పరిధిలోని 3 కార్పొరేషన్లకు ఒకే వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా పౌర సేవలను అందించాలని అన్నిరకాల పర్మిషన్లు, పన్ను, రుసుముల చెల్లింపునకు సదుపాయం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో ఇతర ప్రభుత్వ శాఖల రుసుముల చెల్లింపు సదుపాయాన్ని కూడా క్యూర్ ఆన్?లైన్ పోర్టల్‌లో చేర్చాలన్నది ప్రతిపాదన. హైదరాబాద్?లోని అన్ని భవనాలకు ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్, అపార్ట్‌మెంట్ల విషయంలో ఫ్లాట్లకు సబ్ ఐడెంటిటీ కోడ్‌ను ఇవ్వాలన్నది బిల్లులోని ప్రతిపాదన. ఆయా గుర్తింపు సంఖ్యతో ప్రజలు తమ ఆస్తి వివరాలు, నీటి బిల్లు, దానికి సంబంధించిన పన్ను, కరెంటు బిల్లు, ఇతరత్రా ఛార్జీలను చెల్లించుకునే వెసులుబాటు కల్పిస్తారు. క్యూర్ బిల్లుపై ప్రభుత్వం ఈ ఏడాది జులై 4వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు స్వీకరించింది. ఆన్‌లైన్‌లో 4,107, ఈ-మెయిల్‌కు 400 అభ్యంతరాలు వచ్చాయి. వాటిలో 2,465 ఫిర్యాదులు ఆస్తిపన్నును పెంచొద్దనే విషయంపైనే ఉన్నాయి. ఎంఐఎం పార్టీ నుంచి 18, బీజేపీ నుంచి ఐదు, ఎంపీ రఘునందన్‌రావు వ్యక్తిగతంగా ఆరు సూచనలు ఈ బిల్లులో చేశారు. వాటిల్లో కొన్ని సూచనలను పరిగణనలోకి తీసుకొని బిల్లులో అధికారులు మార్పులు చేశారు. క్యూర్ బిల్లు హైడ్రాకు చట్టపరమైన గుర్తింపుతోపాటు పలు అదనపు అధికారాలను కూడా కల్పిస్తోంది. సొంత పోలీస్? స్టేషన్? ఏర్పాటుతో కొన్ని నేరాలపై క్రిమినల్ కేసులను నమోదు చేసే అధికారం ఉంది. అగ్నిమాపక భద్రత చర్యలపై తనిఖీల నిర్వహణ, నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై తనిఖీలు, ఇతరత్రా అధికారాలు హైడ్రాకు ఉంటాయి.

రైతుల మోటార్లకు మీటర్లు పెట్టబోము

హైదరాబాద్ : రైతుల మోటర్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోమని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను అప్?గ్రేడ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్?డీఎస్?ఎస్ పథకాన్ని వినియోగించుకుంటామన్నారు. అందులో ఎక్కడా వ్యవసాయ మోటర్లకు మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదని భట్టి విక్రమార్క తెలిపారు. అలాంటి భయాందోళన సృష్టించవద్దని ఆయన సూచించారు. థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటూ వెళ్లాల్సిన అవసరముందని భట్టి విక్రమార్క తెలిపారు.రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించడానికి ప్రభుత్వం ఏటా రూ.14,000 కోట్లు, 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 5,000 కోట్లు చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ విధంగా కేవలం సబ్సిడీల రూపంలోనే ఏటా దాదాపు రూ.19,000 కోట్లు ఖర్చవుతోందని ఆయన వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయంసమృద్ధి సాధిస్తారన్నారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్ రాత్రివేళ అందుబాటులో ఉండనందున, ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌తో మైక్రో గ్రిడ్లను నిర్మిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్ విద్యుత్‌తో పాటు బ్యాటరీ స్టోరేజ్ ద్వారా గ్రామాలకు విద్యుత్ ఇచ్చే 'మైక్రో గ్రిడ్' ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా(పైలట్?) చేపట్టామని ఆయన మండలిలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వీజీఎఫ్ ద్వారా మూడుసార్లు టెండర్లు పిలిచినా, బ్యాటరీ స్టోరేజ్ ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో సాంకేతికత పెరిగి బ్యాటరీ ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా పర్యావరణహితమైన హరిత ఇంధన రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 విశేషాలను వివరించారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కేవలం 15,497 మెగావాట్లుగా మాత్రమే ఉండేదని, అయితే సెప్టెంబర్ 9 నాటికి అది 19,543 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. వివిధ కారణాల రీత్యా ఈ ఏడాది డిమాండ్ 20,000 నుంచి 21,000 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని, ఈ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే సాంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ ఈ నూతన పాలసీని తెచ్చినట్లు తెలిపారు. పీఎం-కుసుమ్ పథకం కింద రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు భట్టి వెల్లడించారు. ఒక్కొక్కరు 2 మెగావాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్‌గా పూర్తి సోలరైజేషన్ పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. ?కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని, ఇటీవల కరీంనగర్‌లో ఒక ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. మణుగూరు వద్ద సింగరేణి చేపట్టిన మిథేన్ గ్యాస్ ప్రాజెక్ట్ ఖర్చు ఎక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాలేదని, అయితే కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం జరుపుతున్నామని తెలిపారు.

బాబుతో నడ్డా మర్యాదపూర్వక భేటీ

అమరావతి, సెప్టెంబర్ 12 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అమరావతికి విచ్చేసిన కేంద్ర మంత్రి నడ్డాను సీఎం చంద్రబాబు తన నివాసానికి ఆహ్వానించారు. సీఎం నివాసానికి చేరుకున్న జేపీ నడ్డాకు చంద్రబాబు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సాధారణంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇది పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కేంద్రంలో, రాష్ట్రంలో మిత్రపక్ష ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య ఇలాంటి సమావేశాలు జరగడం సాధారణమే. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు జేపీ నడ్డా ఆయన నివాసానికి వెళ్లారు. అధికారిక కార్యక్రమాల నిమిత్తం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అంతకుముందు, విజయవాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో జేపీ నడ్డా, చంద్రబాబు కలిసి రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల విలువైన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతోనే ఇలాంటి అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు.

పౌల్ట్రీ రంగానికి కొత్త ఊపిరి

భారీ ప్యాకేజీతో ఊతమందించారు

మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

అమరావతి, సెప్టెంబర్ 12 : రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని బలోపేతం చేసి, పౌల్ట్రీ రైతులకు పూర్తి స్థాయి అండగా నిలిచేందుకు 'ఏపీ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026--29'కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలో పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసిన సందర్భంగా మాట్లాడిన మంత్రి... ఈ రంగం అభివృద్ధికి రూ.657 కోట్ల భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించామని వెల్లడించారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడమే ఈ పాలసీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యంగా కోళ్ల ఫారాలు, హేచరీల రుణాలపై 4 శాతం వడ్డీ రాయితీ, లో-టెన్షన్ ఫారాలకు యూనిట్‌కు రూ.3.75, ఫీడ్ మిక్సింగ్ యూనిట్లకు రూ.4.75 టారిఫ్ క్రమబద్ధీకరణ కల్పించామన్నారు. కొత్త ఎన్విరాన్‌మెంట్ కంట్రోల్డ్ (జుజ) పౌల్ట్రీ షెడ్లకు రూ.25 లక్షల వరకు, పాత షెడ్ల ఆధునీకరణకు రూ.20 లక్షల వరకు 25 శాతం క్యాపిటల్ సబ్సిడీ అందించే అవకాశం కల్పించామని తెలిపారు. బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏటా 2,720 మదర్ పౌల్ట్రీ యూనిట్లను స్థాపిస్తామన్నారు. పీపీపీ విధానంలో విజయవాడ, విశాఖపట్నం, చిత్తూరు కేంద్రాలుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, ఫీడ్ వ్యయాన్ని తగ్గించేందుకు కేంద్రంతో చర్చించి నూక బియ్యం సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లోకి జారిన సూచీలు చివర్లో కొంత కోలుకున్నాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను కనిష్ఠాల నుంచి కొంత వరకు గట్టెక్కించాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 120.83 పాయింట్లు నష్టపోయి 74,781.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 79.70 పాయింట్లు తగ్గి 23,398.10 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హిందాల్కో ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ముందున్నాయి.

కుబేరా ప్రీఈవెంట్ వాయిదా...15కు రీషెడ్యూల్

ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల రూపొందించిన చిత్రం 'కుబేర ప్రీ రిలీజ్ ఈవెంట్ వాయిదా పడింది. అహ్మదాబాద్ విమానప్రమాదం కారణంగా వాయిదా వేశారు. ధనుష్, రష్మిక ,నాగార్జున కీలక పాత్రలో నటించారు. త్వరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న నేపథ్యంలో శుక్రవారం 'కుబేర' ఈవెంట్ నిర్వహించాలని టీమ్ భావించింది. గురువారం జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం దృష్ట్యా ఆ ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను తిరిగి జూన్ 15న ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు చెప్పింది. ముందు అనుకున్నవిధంగానే హైదరాబాద్‌లోనే ఈ కార్యక్రమం జరగనుందని తెలిపింది. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఇందులో హవాలా, మనీలాండరింగ్ తదితర అంశాలు మిళితమై ఉంటాయి. దీంట్లో నటులు ఎక్కడా కనిపించరు. కేవలం పాత్రలు మాత్రమే కనిపిస్తాయని పుస్కుర్ రామ్‌మోహన్‌రావు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో దీనిని విడుదల చేయనున్నట్లు- చెప్పారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన 'కుబేర' ఈనెల 20న విడుదల కానుంది.



జూన్ 22న జననాయగన్ గ్లింప్స్ విడుదల

తమిళ సూపర్ స్టార్ దళపతి విజయ్ మరికొన్ని రోజుల్లో సినిమాలు దూరమవుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్ తమిళ వెట్రి కళగం అనే పార్టీని స్థాపించాడు. ఇక నుంచి తాను పూర్తిగా రాజకీయల్లోనే ఉంటానని.. ఇదే తన చివరి చిత్రం అంటూ దళపతి69 ప్రాజెక్ట్‌ను ప్రారంభించాడు. జన నాయగన్ (ప్రజల నాయకుడు) అనే టైటిల్‌తో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను కార్తీ సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి తాజాగా ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. మరో 8 రోజుల్లో విజయ్ పుట్టినరోజు రాబోతుంది. ఈ సందర్భంగా అభిమానుల కోసం మేకర్స్ భారీ సర్‌ప్రైజ్ ప్లాన్ చేసినట్లు- తెలుస్తుంది. జూన్ 22న జననాయగన్ ఫస్ట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేస్తున్నట్లు- సమాచారం. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించనుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ ఈ మూవీని నిర్మిస్తుంది. పూజ హెగ్దేతో పాటు- ప్రేమలు ఫేమ్ మమితా బైజు ఈ సినిమాలో కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాను జనవరి 09 2026న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు- చిత్రబృందం ఇప్పటికే వెల్లడించింది.



రామ్‌చరణ్‌తో త్రివిక్రమ్ మూవీ లేనట్లేనా?

రామ్ చరణ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఒక సినిమా రూపొందే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. నిజానికి అదేమీ లేదని అర్థమయ్యేలా త్రివిక్రమ్ తరపున నిర్మాత నాగ వంశీ ఒక ట్వీట్ వేశాడు. ప్రస్తుతానికి వెంకటేష్, జూనియర్ ఎన్టీఆర్ సినిమాలను మాత్రమే త్రివిక్రమ్ ఫైనల్ చేశారని, ఆయనకు సంబంధించిన ఏ అప్‌డేట్ అయినా తాను సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తానని చెప్పాడు. అయితే, రామ్ చరణ్‌తో సినిమా ఉంటుందా, ఉండదా అనే చర్చపై అనేక వార్తలు వస్తున్నాయి. కానీ, ఇప్పట్లో రామ్ చరణ్ త్రివిక్రమ్‌తో సినిమా చేసే అవకాశం లేదు. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్ది అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా పూర్తయిన వెంటనే సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమా సైన్ చేశాడు. ఆ సినిమా పూర్తయిన తర్వాత త్రివిక్రమ్‌తో సినిమా చేయాలనుకున్నాడు, కానీ కొన్ని అంతర్గత కారణాల వల్ల ఆ సినిమాను పక్కన పెట్టేశాడు. తాజా సమాచారం ప్రకారం, రామ్ చరణ్ సుకుమార్ సినిమా పూర్తయిన వెంటనే సందీప్ రెడ్డి వంగాతో సినిమా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ సినిమా దాదాపు ఫైనల్ అయినప్పటికీ, అధికారికంగా అనౌన్స్ చేయకపోతే నిజమని చెప్పలేం. కాబట్టి, త్రివిక్రమ్- రామ్ చరణ్ సినిమా ప్రస్తుతానికి ఆగిపోయింది. భవిష్యత్తులో ఉండొచ్చు లేదా ఉండకపోవచ్చు. త్రివిక్రమ్ చెప్పిన కథ రామ్ చరణ్‌కు నచ్చినప్పటికీ, అంతర్గత కారణాల వల్ల ఆ సినిమాను పక్కన పెట్టినట్లు- తెలుస్తోంది.



రివాల్వర్ రాణి ఆగమనం

వివాహానంతరం సినిమాల్ని బాగా తగ్గించింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. ప్రస్తుతం ఆమె చేతిలో రెండు సినిమాలు మాత్రమే ఉన్నాయి. తాజాగా ఈ భామ 'రివాల్వర్ రీటా' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించబోతున్నది. దాదాపు రెండేళ్ల క్రితం మొదలైన ఈ సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకురాబోతున్నది. వినాయక చవితి సందర్భంగా ఆగస్ట్ 27న 'రివాల్వర్ రీటా' సందడి చేయబోతున్నది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. జేకే చంద్రు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించారు. ఈ సందర్భంగా కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. దీనిని కీర్తి సురేష్ తన సోషల్‌మీడియా ఖాతాల్లో పంచుకుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌లో కీర్తి సురేష్ చేసిన పోరాటాలు, పండించిన కామెడీ హైలైట్‌గా నిలిచాయి. తన కెరీర్‌లో ఇదొక వైవిధ్యమైన చిత్రమని, ఇందులో తొలిసారి యాక్షన్ ఎపిసోడ్స్ చేశానని కీర్తి సురేష్ చెప్పింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తమిళంలో 'కన్నివీడి' చిత్రంలో నటిస్తున్నది.



రాజాసాబ్ టీజర్ విజువల్స్ లీక్

షేర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' జూన్ 16న ఈ సినిమా టీజర్ విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీనికి లీకుల బెడద మొదలైంది. టీజర్ విజువల్ వీడియోలు కొన్ని నెట్టింట లీక్ అయ్యాయి. దీనిపై టీమ్ స్పందించింది. లీక్ కంటెంట్‌ను షేర్ చేసేవాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎవరైనా 'రాజాసాబ్' కంటెంట్‌కు సంబంధించిన అనధికారక వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తే వారి సోషల్ మీడియా అకౌంట్‌ను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు చిత్రబృందం ఎంతో కష్టపడుతోందని దానికి అందరూ సహకరించాలని కోరింది. ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ఇది విడుదల కానుంది. దీని టీజర్ జూన్ 16న రిలీజ్ చేయనున్నట్లు టీ-మ్ ఇప్పటికే ప్రకటించింది. ఈ టీజర్ రిలీజ్ కోసం ఓ భారీ ఈవెంట్‌ను ఏర్పాటు చేసినట్లు- వార్తలు వస్తున్నాయి. దీనికోసం జాతీయ మీడియాకు కూడా ఆహ్వానాలు అందినట్లు- సమాచారం. ఈ ఈవెంట్‌లో 'రాజాసాబ్' కోసం వేసిన భారీ సెట్‌ను కూడా చూపించనున్నట్లు- తెలుస్తోంది. ఇందులో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అమితాబ్ వర్క్ హాలిక్

2 గంటల్లోనే యాడ్ ఫిలిం పూర్తి చేశా

అమితాబ్ బచ్చన్ 82 ఏళ్ల వయసులోనూ చలాకీగా చురుకుగా ఉంటారు. పని ఉంటే ఠక్కున పూర్తి చేస్తారు. సినిమా షూటింగ్‌లు కూడా ఇలాగే పూర్తి చేస్తారు. తన డైలీ లైఫ్ ÷-టసైల్‌ను తెలియజేస్తూ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్ తరచూ బ్లాగ్‌లో పోస్టులు పెడుతుంటారు. తాజాగా ఆయన తన వర్క్ లైఫ్ గురించి పోస్ట్ పెట్టారు. సుమారు 2 గంటల్లోనే తాను చాలా వర్క్‌ చేశానని చెప్పారు. వర్క్‌లో తన స్పీడ్ చూసి ఒక దర్శకుడు చమత్కారం చేశాడని అన్నారు. ఇంత స్పీడ్‌గా వర్క్ చేయడం కరెక్ట్ కాదని దర్శకుడు తనతో చెప్పారని ఆయన పేర్కొన్నారు. పని చేయడంలో ఎంతో ఆనందం ఉంటుంది. కేవలం రెండు గంటల్లో ఐదు సినిమాలు, రెండు ఫొటోషూట్‌ల కోసం వర్క్ చేశా. అవన్నీ కూడా ఒక వాణిజ్య ప్రకటన కోసమే అయినప్పటికీ ఇంత త్వరగా వాటిని పూర్తి చేసినందుకు ఎంతో సంతోషంగా అనిపించింది. వర్క్‌లో నా స్పీడ్ చూసి దర్శకుడు, సిబ్బంది షాకయ్యారు. పని చేసే విధానాన్ని నేను పాడుచేస్తున్నానంటూ ఆయన చమత్కారం చేశారు. కానీ, నాకు మాత్రం ఇలా వర్క్ చేయడం చాలా సంతోషంగా అనిపించింది. సినిమా పైనే ఆధారపడే ఎంతోమంది కార్మికులను దృష్టిలో ఉంచుకుని వారి కోసమే నేను వరుస వర్క్‌ చేస్తున్నా అని అమితాబ్ బచ్చన్ పేర్కొన్నారు. తాను కెరీర్ ప్రారంభించిన నాటినుంచి ఇప్పటివరకూ సినీ ప్రపంచంలో తాను ఎన్నో మార్పులు చూశానని ఆయన రాసుకొచ్చారు. ఈ వయసులోనూ ఆయన వరుసగా ప్రాజెక్టులు చేయడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056